VELTHURU TELUGU DAILY

# వెలుతురు


తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 29.06.2026

సంపుటి : 08 సంచిక : 20 , పెజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



వృద్ధ తల్లిని భుజాలపై మోసుకుంటూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి తీసుకెళ్తున్న కుమారుడు. తల్లిపట్ల ప్రేమ, సేవా భావానికి ప్రతీకగా నిలిచిన ఈ దృశ్యం భక్తులను కదిలించింది.

యాదగిరిగుట్ట వెలుతురు జూన్ 28:

# పదేళ్లు దోచుకున్న కుటుంబాన్ని ప్రజలు తిరస్కరించారు

సీఎం రేవంత్‌రెడ్డి





- కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగిన రేవంత్
- పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లే మా లక్ష్యం
- రైతులకు రూ.1.56 లక్షల కోట్ల సాయం
- 30 నెలల్లో 70 వేల ఉద్యోగాల భర్తీ
- కులగణనతో దేశానికి తెలంగాణ దారి
- కోమటిరెడ్డి త్యాగాన్ని కొనియాడిన సీఎం
- ఎట్టి పరిస్థితుల్లోనూ మూసీ ప్రక్షాళన
- కాళేశ్వరం వైఫల్యంపై బీఆర్ఎస్‌కు సవాల్
- ఎస్ఎల్‌బీసీ, డిండి పూర్తి చేస్తామని హామీ

**నల్లగొండ జిల్లా వెలుతురు జూన్ 28:**

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు వేలాది మంది ఉద్యమకారులు, విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగాలు చేస్తే, ఆ ఉద్యమ ఫలితాన్ని మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్న ఆ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు శాశ్వతంగా తిరస్కరించారని, వారికి మళ్లీ అధికారం కట్టబెట్టే పరిస్థితి లేదన్నారు.

▶ మిగతా 2లో

# అన్నదాతలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'

- ఈనెల 30న చింతకానిలో సీఎం రేవంత్‌రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'
- రైతులకు సంకెళ్లు వేసిన నాటి పాలకులా నేడు మొసలి కన్నీరు కార్చేది?



## భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, వెలుతురు జూన్ 28:**

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు గారి జయంతి సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి అలాగే రోడ్లు, భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారితో కలిసి పి.వి. నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## మోదీకి గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' పురస్కారం

- సీషెల్స్ ప్రభుత్వం, ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు
- ఈ గౌరవాన్ని వాతావరణ మార్పులతో పోరాడుతున్న దేశాలకు అంకితం
- భావితరాల కోసం పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వ్యాఖ్య
- వాతావరణ సంక్షోభాన్ని కలిసి ఎదుర్కోవాలని ప్రపంచ దేశాలకు పిలుపు
- పచ్చదనం, సుస్థిర అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందన్న ప్రధాని
- మిషన్ లైఫ్, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ వంటి కార్యక్రమాల ప్రస్తావన



## పశ్చిమాసియా సంక్షోభాన్ని ఒక్కటిగా ఎదుర్కొన్నాం మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ

- మన్ కీ బాత్‌లో దేశ ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్న పిలుపుకు విశేష స్పందన
- పాత బంగారాన్ని రీసైకిల్ చేసి ఆభరణాలు తయారు చేసుకుంటున్న కుటుంబాలు
- ఇంధన పొదుపు, కార్‌పూలింగ్‌తో దేశానికి అండగా నిలిచిన ప్రజలు
- విదేశీ ప్రయాణాలు తగ్గించి స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం
- రక్షణ రంగంలో భారత్ వేగంగా ఆత్మనిర్భరత సాధిస్తోంది
- స్వదేశీ సి-295 సైనిక విమానం విజయవంతమైన తొలి ప్రయాణం
- యోగా ఛాంపియన్‌షిప్‌లో 114 పతకాలతో భారత్ అగ్రస్థానం
- నాలంద విశ్వవిద్యాలయం భారతీయ జ్ఞాన సంప్రదాయాలకు ప్రతీక
- ఆధునిక సాంకేతికతతో పాటు సాంస్కృతిక



**మూలాలను కాపాడుకోవాలని పిలుపు**

**ఢిల్లీ వెలుతురు జూన్ 28:**

దేశ ప్రజల సహకారంతోనే పశ్చిమాసియా సంక్షోభం వంటి క్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలుగుతున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా తాను చేసిన పలు సూచనలకు ప్రజలు విశేషంగా స్పందించారని, కేవలం మద్దతు తెలపడమే కాకుండా వాటిని ఆచరణలో పెట్టడం దేశ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.బంగారం కొనుగోళ్లు తగ్గించాలని చేసిన విజ్ఞప్తిని అనేక కుటుంబాలు స్వీకరించాయని ప్రధాని చెప్పారు. ఈసారి పెళ్లిళ్లు వంటి శుభకార్యాల కోసం కొత్త బంగారం కొనుగోలు చేయకుండా, ఇప్పటికే ఉన్న బంగారాన్ని రీసైకిల్ చేసి కొత్త ఆభరణాలు తయారు చేసుకునే దిశగా ప్రజలు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇది బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్‌లోనే ఓటు నమోదు చేసుకోండి: కిషన్ రెడ్డి

- ఇతర జిల్లాల ప్రజలకు కేంద్ర మంత్రి పిలుపు
- నగరంలో ఉంటే ఓటు కూడా ఇక్కడే ఉండాలని సూచన
- కాంగ్రెస్ బెదిరింపులను నమ్మొద్దని వ్యాఖ్య
- పథకాలు పోతాయన్న ప్రచారం అవాస్తవమని ఆరోపణ
- ఓటును తిరిగి మార్చుకునే అవకాశం ఉంటుందని వెల్లడి
- హైదరాబాద్ ప్రయోజనాల కోసం ఓటు కీలకమని వ్యాఖ్య
- నగరాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపు
- ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని సూచన



## బీజేపీ పరాయి పార్టీ కాదు.. తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ: నితిన్ నబీన్

- తెలంగాణలో 9 కొత్త బీజేపీ జిల్లా కార్యాలయాల ప్రారంభం
- కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలిపిన జాతీయ అధ్యక్షుడు
- పార్టీ కార్యాలయాలు ప్రజాసేవకు అంకితమైన సంకల్ప కేంద్రాలని వ్యాఖ్య
- 'దేశమే మొదట.. పార్టీ తర్వాత..



స్వార్థం చివర' సిద్ధాంతంతో పనిచేయాలని పిలుపు

## రూ.13,060 కోట్లతో హ్యామ్ రోడ్లకు శ్రీకారం.. పైలాన్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

- కనగల్‌లో హ్యామ్ రోడ్ల ప్రాజెక్టుకు ప్రారంభం
- రూ.13,060 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా పనులు
- 34 ప్యాకేజీల్లో 441 రహదారుల విస్తరణ
- మొత్తం 6,092 కి.మీ. రోడ్ల అభివృద్ధి
- ప్రజాప్రతినిధులు, మంత్రులు పాల్గొన్న కార్యక్రమం
- స్థానికులను ఆప్యాయంగా పలకరించిన ముఖ్యమంత్రి
- రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు



## 2028లో మళ్లీ కేసీఆరే సీఎం.. కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు: కేటీఆర్



# మోదీకి గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' పురస్కారం

**ఢిల్లీ వెలుతురు జూన్ 28:**

సీషెల్స్ ప్రభుత్వం, అక్కడి ప్రజలు, అధ్యక్షుడు హెర్మినీ తనకు గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్ పురస్కారాన్ని ప్రదానం చేయడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ గౌరవం అందించడం పట్ల సీషెల్స్ ప్రజలకు, ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ పురస్కారాన్ని ఎంతో వినమ్రంగా స్వీకరిస్తున్నానని మోదీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటున్న, పర్యావరణ పరిరక్షణను భావితరాల పట్ల తమ బాధ్యతగా భావిస్తున్న అన్ని దేశాలకు ఈ గౌరవాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు.వాతావరణ మార్పు ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటని ప్రధాని అన్నారు. ఈ సమస్యను ఏ ఒక్క దేశం ఒంటరిగా పరిష్కరించలేదని, అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేస్తేనే దీనిని అధిగమించగలమని స్పష్టం చేశారు.భూమిని మరింత పచ్చగా, సుస్థిరంగా తీర్చిద్దేందుకు భారత్ తన వంతు బాధ్యతను పూర్తిగా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. ఇందుకోసం దేశంలో అమలు చేస్తున్న పర్యావరణహిత విధానాలతో పాటు మిషన్ లైఫ్ , ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ , కోయలిషన్ ఫర్ డిజాస్టర్ రెసిలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అంతర్జాతీయ కార్యక్రమాల ద్వారా కూడా భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తోందని పేర్కొన్నారు.

# అన్నదాతలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'

- ఏర్పాట్ల పరిశీలన అనంతరం మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**చింతకాని వెలుతురు జూన్ 28:**



రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాహసోపేత నిర్ణయాలతో అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో ఈనెల 30వ తేదీ మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్న 'రైతు ఆశీర్వాద సభ' ఏర్పాట్లను ఆదివారం ఆయన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల భారీ బలగంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను అంగుళం అంగుళం వీక్షించి, వాతావరణ మార్పులను తట్టుకునేలా జర్మన్ హ్యాంగర్లతో అద్భుతమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

### వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి పైసలు...

అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాల సూచనలు ఉన్నప్పటికీ, ఏ విపత్తు ఎదురైనా ఈ సభ అనుకున్న దానికంటే డబుల్, ట్రిబుల్ సక్సెస్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను అక్షరాలా నిలబెట్టుకుంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో క్యాబినెట్ సాహసోపేత నిర్ణయం తీసుకుని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మానవీయ కోణంలో కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. కేవలం కొనడమే కాకుండా, కొన్న వారం రోజుల లోపలే రైతుల అకౌంట్లలో పైసలు వేసిన నిఖార్సైన రైతు పక్షపాత ప్రభుత్వం ఇది అని కొనియాడారు.

### రైతు ద్రోహులే నేడు కపట ప్రేమికులు!

గత పదేళ్ల పాలకుల తీరుపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కేంద్ర, రాష్ట్రాల్లో గతంలో అధికారంలో ఉన్నవాళ్లు నేడు ఈ ప్రభుత్వంపై అనవసరంగా అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ప్రజలు తమ వైపు చూడటం లేదనే తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లోనే వాళ్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. "ఇదే ఖమ్మం పట్టణంలో గతంలో వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు, రైతుల కష్టాలు పట్టించుకోకుండా, నడిరోడ్డుపై అన్నదాతలకు సంకెళ్లు వేసి జైలుకు పంపించిన దుర్మార్గాన్ని ఈ జిల్లా ప్రజలు ఎన్నటికీ మరవరు. నాడు రైతులను విస్మరించి, హింసించిన వాళ్లే.. నేడు మొసలి కన్నీరు కారుస్తూ కపట ప్రేమ ఒలకబోస్తున్నారు. ఈ రాజకీయ డ్రామాలను రైతులందరూ గమనిస్తూనే ఉన్నారు" అని హెచ్చరించారు. జిల్లా సీనియర్ నేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేలందరినీ కలుపుకుని ఈ సభను ఒక చారిత్రాత్మక విజయంగా మలుస్తామన్నారు.

### ఇందిరమ్మ రాజ్యంలో రికార్డు స్థాయి ప్రగతి

ఈ ప్రభుత్వం పేద ప్రజలందరికీ అండగా ఉండే ఇందిరమ్మ రాజ్యమని సభ ఏర్పాట్ల పరిశీలనలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 72,000 ఉద్యోగాలు ఇచ్చామని, రాబోయే రోజుల్లో మరిన్ని వేలాది నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సాగుతున్నాయన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్నామని, రూరల్ ప్రాంతాలకు 2.5 లక్షలు, అర్బన్ కు లక్ష ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తామని, రహదారుల అభివృద్ధి కోసం రూ. 22,000 కోట్లను సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేయడం విశేషమని తెలిపారు.ఈ ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, తోట దేవీ ప్రసన్న, వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్, కమిషనర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీపీ సునీల్ దత్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు దోచుకున్న కుటుంబాన్ని...

(మొదటి పేజీ తరువాయి)

నల్గొండ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నాగార్జున కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.గ్రామాల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతుంటే బీఆర్ఎస్ నాయకులకు కడుపుమంటగా ఉందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారే తప్ప పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు.రాష్ట్రంలో ఏటా రూ.16 వేల కోట్లతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, గత 30 నెలల్లో రైతుల ఖాతాల్లో రూ.1.56 లక్షల కోట్లను జమ చేశామని తెలిపారు. యూరియా సరఫరాలో కేంద్రం సహకరించకపోయినా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు.కేవలం 30 నెలల్లోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి చరిత్ర సృష్టించామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన ప్రభావంతోనే కేంద్రం కూడా జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామని ప్రకటించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమ చరిత్రలో నల్గొండ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తొలి దశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవిని త్యాగం చేశారని, మలిదశ ఉద్యమంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి పదవిని వదులుకుని ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను బీఆర్ఎస్ నాయకులు తమ ఖాతాలో వేసుకున్నారని ఆరోపించారు. పెట్రోల్ పోసుకుని ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి వంటి అమరవీరులను రాష్ట్రం ఎప్పటికీ మరచిపోదన్నారు.మూసీ నది కాలుష్యం నల్గొండ ప్రజలకు శాపంగా మారిందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. దీనిని కూడా కొందరు రాజకీయ నాయకులు వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ ప్రక్షాళనను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు.ఫామ్‌హౌస్‌లో ప్రత్యేక యంత్రాలు ఏర్పాటు చేసి ప్రజల ఫోన్ సంభాషణలను కూడా విన్నారని బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు నిజాలు మాట్లాడే అలవాటు లేదని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిపోయిందని ఆరోపించిన సీఎం, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభమైన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లపాటు పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.హ్యామ్ రోడ్ల శంకుస్థాపన సందర్భంగా నల్గొండ ఎన్జీ కాలేజీ మైదానంలో బహిరంగ సభకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ లు బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, కోటిరెడ్డి, నెల్లికంటి సత్యం, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా సంక్షోభాన్ని ఒక్కటిగా...

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ఇంధన వినియోగాన్ని తగ్గించాలని చేసిన పిలుపుకు కూడా ప్రజలు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్‌పూలింగ్‌ను ప్రోత్సహించడం, అవసరం లేని ప్రయాణాలను తగ్గించడం, విదేశీ పర్యటనలను వాయిదా వేయడం, దేశీయ ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించడం వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి మేలు చేస్తున్నాయని వివరించారు.

ఇలాంటి చిన్న చిన్న మార్పులే పెద్ద ఫలితాలను ఇస్తాయని ప్రధాని పేర్కొన్నారు.

### రక్షణ రంగంలో స్వయం సమృద్ధి

దేశ భద్రత, స్వయం సమృద్ధి దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. 2026 తొలి ఆరు నెలల్లో రక్షణ, సాంకేతికత, తయారీ రంగాల్లో భారత్ అనేక కీలక విజయాలు సాధించిందన్నారు. స్వదేశీ సాంకేతికతతో రక్షణ సామర్థ్యాలు మరింత బలపడుతున్నాయని చెప్పారు.

ఈ సందర్భంగా స్వదేశంలో తయారైన సి–295 సైనిక రవాణా విమానం తొలి విజయవంతమైన ప్రయాణాన్ని ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు కింద దేశంలోనే 40 విమానాలు తయారవుతున్నాయని, దీంతో ఎంఎస్ఎంఈలు, ఏరోస్పేస్ రంగాలకు ఊతం లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వివరించారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఇది కీలక ముందడుగని అన్నారు.

### యోగా దినోత్సవానికి ప్రపంచవ్యాప్త ఆదరణ

ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైందని ప్రధాని తెలిపారు. 2,500కు పైగా ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించగా, కోట్లాది మంది పాల్గొన్నారని చెప్పారు.అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ ను ప్రస్తావిస్తూ, ఇందులో భారత్ 102 స్వర్ణాలతో సహా మొత్తం 114 పతకాలు సాధించి పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఇది భారత యోగా సంప్రదాయానికి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న గుర్తింపుకు నిదర్శనమని అన్నారు.

### నలంద విశ్వవిద్యాలయానికి ప్రధాని ప్రశంసలు

భారతీయ ప్రాచీన జ్ఞాన సంప్రదాయాలను ఆధునిక విద్యతో సమన్వయం చేస్తూ నాలంద విశ్వవిద్యాలయం చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. రెండేళ్ల క్రితం నాలందా నూతన ప్రాంగణాన్ని ప్రారంభించే అవకాశం తనకు లభించిందని గుర్తు చేసుకున్నారు.ప్రాచీన భారతీయ శాస్త్రార్థ సంప్రదాయాన్ని ఈ విశ్వవిద్యాలయం తిరిగి తీసుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు కొత్త సాంకేతిక విప్లవం దిశగా వేగంగా సాగుతోందని, అయితే సాంకేతికతను స్వీకరిస్తూనే మానవ సృజనాత్మకతను, భారతీయ విలువలను కాపాడుకోవడం అత్యంత అవసరమని చెప్పారు. దేశంలోని ఇతర ఉన్నత విద్యాసంస్థలు కూడా నాలంద తరహా కార్యక్రమాలను చేపట్టాలని ప్రధాని సూచించారు.

# భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు...

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు హుస్సేన్‌సాగర్ సమీపంలోని పి.వి. ఘాట్ వద్ద నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పాల్గొని పి.వి. సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... "పి.వి. నరసింహారావు గారు తెలంగాణ గడ్డకు చెందిన మహోన్నత మేధావి, దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన దార్శనిక నాయకుడు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న క్లిష్ట సమయంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, తన దూరదృష్టి, ధైర్యవంతమైన నిర్ణయాలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన సంస్కరణల రూపశిల్పి. నేడు ప్రపంచ వేదికపై భారత్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఆయన చేపట్టిన సంస్కరణలే బలమైన పునాది."అని వివరించారు. "పి.వి. గారు రాజకీయవేత్త మాత్రమే కాదు... అసాధారణ మేధాశక్తి కలిగిన బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త, తాత్వికుడు, పరిపాలనా దక్షుడు. అధికారంలో ఉన్నప్పుడు నిరాడంబరత, నిజాయితీ, ప్రజాహితం పట్ల అంకితభావంతో పనిచేసి ఆదర్శ ప్రజానాయకుడిగా నిలిచారని గుర్తు చేశారు.

"దేశ ప్రయోజనాలే పరమావధిగా భావించి తీసుకున్న నిర్ణయాలు భారత భవిష్యత్తును మార్చాయి. పరిపాలనలో సంయమనం, రాజకీయాల్లో విలువలు, ప్రజాసేవలో నిబద్ధతకు పి.వి. నరసింహారావు గారు చిరస్మరణీయ ఆదర్శం. ఆయన జీవితం ప్రతి ప్రజాప్రతినిధికి, ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం." అని ఆయన సేవలను కొనియాడారు."పి.వి. నరసింహారావు గారి సేవలను చిరస్థాయిగా గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్య, సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. ఆయన చూపిన మార్గంలోనే సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంద ని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 2028లో మళ్లీ కేసీఆరే సీఎం.. కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు: కేటీఆర్

- వికారాబాద్ బీఆర్ఎస్ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపణ
- కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వ్యాఖ్య
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ పక్కన పెట్టిందని ఆరోపణ
- దామగుండం భూములను కేంద్రానికి అప్పగించారని విమర్శ
- బీఆర్ఎస్ శ్రేణులు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పిలుపు



**వికారాబాద్ వెలుతురు జూన్ 28:**

వికారాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 2028లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చి కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.జ్వరం ఉన్నప్పటికీ వికారాబాద్ ప్రజలను కలిసేందుకు వచ్చానని కేటీఆర్ తెలిపారు. వికారాబాద్ గాలి, నీరు, ప్రకృతి ఔషధాల వంటివని, ఇది రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతమని కొనియాడారు. వికారాబాద్ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఎంతో కృషి చేశారని, అలాంటి నాయకుడిని ప్రజలు కోల్పోయారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ అప్పులు చేసి వెళ్లారని ప్రచారం చేస్తోందని, కానీ పార్లమెంట్‌లో వెల్లడైన లెక్కల ప్రకారం కేసీఆర్ పాలనలో రాష్ట్ర అప్పులు రూ.2.80 లక్షల కోట్ల మేర మాత్రమే పెరిగాయని చెప్పారు. ఆ అప్పులతోనే మెడికల్ కాలేజీలు, గురుకులాలు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు సకాలంలో అందేవని, ఇప్పుడు రైతులు ఎరువులు, విద్యుత్ కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతుబంధు కొనసాగిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేసిందని విమర్శించారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు ప్రజలు వారి వైఫల్యాలను గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.దామగుండంలో నేవీ రాడార్ కోసం 2,900 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించిందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 12 లక్షల చెట్లు నరుకుతారని ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. అలాగే మూసీ అభివృద్ధి పేరుతో కూడా చెట్లను నరుకుతున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు.పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం వరకు పూర్తి చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఆ ప్రాజెక్టును పక్కన పెట్టిందని అన్నారు. ఆ ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే కారణంతోనే పనులు నిలిపివేశారని ఆరోపించారు.శాసనసభ స్పీకర్ వ్యవహారశైలిపైనా కేటీఆర్ విమర్శలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడం లేదని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు తటస్థంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు విధులు నిర్వర్తించాలే తప్ప అధికార పార్టీ కోసం అతిగా వ్యవహరించవద్దని హెచ్చరించారు.వికారాబాద్ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ కమిటీలను బలోపేతం చేయాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. గులాబీ జెండాను మళ్లీ ఎగురవేసి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపిద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# అమరావతి రాజధాని లో పివి.నరసింహారావు విగ్రహం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కి లేఖ రాసిన ప్రసన్న కుమార్ శర్మ

హైదరాబాద్ వెలుతురు జూన్ 28:

గౌరవపూర్వక దేశభక్తి భావంతో, తమ దయగల పరిశీలనార్థం ఈ వినతిపత్రాన్ని అత్యంత వినమ్రతతో సమర్పిస్తున్నాను.భారతరత్న  పి.వి. నరసింహారావు తెలుగు నేల గర్వించదగిన మహనీయులు. ఆయన అసమాన రాజనీతిజ్ఞుడు, దూరదృష్టి కలిగిన ఆర్థికవేత్త, విశిష్ట పండితుడు, బహుభాషా కోవిదుడు, సంస్కరణవాది, సమర్థ పరిపాలకుడు మరియు స్వతంత్ర భారతదేశం అందించిన అత్యంత ప్రతిభావంతులైన రాజకీయ నాయకులలో ఒకరు. ప్రధానమంత్రిగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించి, భారతదేశాన్ని ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ మరియు వ్యూహాత్మక ఆధునికీకరణ దిశగా తీసుకెళ్లిన మహోన్నత నాయకుడు. పి.వి. నరసింహారావు గారు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు; అసాధారణ మేధాశక్తి కలిగిన మహనీయుడు. ఆయన పరిపాలనా దక్షత, దౌత్య నైపుణ్యం, రాజ్యాంగ పరిజ్ఞానం భారతదేశానికి ప్రపంచ వేదికపై విశిష్టమైన గౌరవాన్ని తీసుకు వచ్చాయి. ఆర్థిక పునరుజ్జీవనం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణ, విదేశాంగ విధాన సంస్కరణలు, జాతీయ సమైక్యత వంటి రంగాలలో



ఆయన చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.తెలుగు జాతి గర్వించదగిన మహానుభావుడైన శ్రీ పి.వి. నరసింహారావు గారి సేవలు ప్రాంతీయ హద్దులను దాటి యావత్ తెలుగు ప్రజలకే కాక దేశానికంతటికీ స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. అందువల్ల ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం చారిత్రకంగా, సాంస్కృతికంగా అత్యంత సముచితమైన చర్య అవుతుంది. ఆ విగ్రహం తెలుగు ఆత్మగౌరవానికి, జాతీయ నాయకత్వానికి, భారతీయ నాగరికత మేధో సంపదకు చిరస్మరణీయ చిహ్నంగా భావితరాలకు స్ఫూర్తినిస్తుంది.ప్రజాస్వామ్య విలువలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా రూపుదిద్దుకుంటున్న అమరావతి నగరం, ఆధునిక భారతదేశ మహనీయ శిల్పుల్లో ఒకరైన శ్రీ పి.వి. నరసింహారావు గారి స్మృతిని చిరస్థాయిగా నిలుపుకునే అర్హత కలిగిన ప్రదేశం. ప్రతిపాదిత విగ్రహం ఆయన దేశానికి అందించిన అపూర్వ సేవలను శాశ్వతంగా స్మరింపజేయడమే కాకుండా, విద్యా ప్రావీణ్యం, నిరాడంబరత, రాజనీతిజ్ఞత, ప్రజాసేవ వంటి ఉన్నత ఆదర్శాలతో యువతను ప్రేరేపిస్తుంది.ఈ నేపథ్యంలో, అమరావతిలో తగిన ప్రాముఖ్యత కలిగిన ప్రదేశంలో భారతరత్న శ్రీ పి.వి. నరసింహారావు గారి ప్రతిష్ఠాత్మక విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయమై గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారితో తగిన స్థాయిలో సంప్రదింపులు ప్రారంభించి, ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లవలసిందిగా మిమ్మల్ని హృదయపూర్వకంగా వినతిచేస్తున్నాను.ఈ మహోన్నత కార్యక్రమానికి మీరు అందించే సహకారం, మేధావులు, చరిత్రకారులు, శ్రీ పి.వి. నరసింహారావు గారి అభిమానులు, అలాగే తెలుగు సమాజం మొత్తం నుండి విశేష ఆదరణను పొందుతుందనే పూర్తి నమ్మకం నాకు ఉంది.అత్యున్నత గౌరవాభివందనాలతో మీ విశ్వాస పాత్రుడు పి. ప్రసన్న కుమార్ శర్మ పీసీసీ అధ్యక్షుల కార్యాలయానికి అనుబంధంగా.



# బీజేపీ చెప్పే 'చీకటి రోజులు' కంటే గత 12 ఏళ్ల పాలనే దేశానికి నిజమైన చీకటి రోజులు

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి
పి. ప్రసన్నకుమార్ శర్మ
హైదరాబాద్ వెలుతురు జూన్ 28:

ఇందిరాగాంధీ గారు విధించిన ఎమర్జెన్సీని "చీకటి రోజులు"గా ప్రకటిస్తున్న భారతీయ జనతా పార్టీ, గత దాదాపు 12 సంవత్సరాలుగా దేశంలోని పేదలు, బడుగు బలహీన వర్గాలు, యువత, రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న కష్టాలను కూడా చీకటి రోజులుగానే గుర్తించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ అన్నారు.ఆ కాలంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఎమర్జెన్సీ విధించబడిందని, దాని వల్ల కొన్ని సానుకూల ఫలితాలు వచ్చినప్పటికీ, కొన్ని ప్రతికూల పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. ఆ నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ మూల్యం కూడా చెల్లించుకుందని గుర్తు చేశారు. అలాంటి విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నించడం హాస్యాస్పదమని విమర్శించారు.దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు పన్నెండు సంవత్సరాలుగా స్వేచ్ఛగా మీడియా సమావేశం నిర్వహించి పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. అలాంటి పరిస్థితులను ప్రజాస్వామ్యానికి వెలుగులుగా ఎలా చెప్పగలరని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీలో ఉన్నంతకాలం అవినీతి




ఆరోపణలు, సీబీఐ, ఈడీ కేసులు ఎదుర్కొన్న నాయకులను బీజేపీలో చేర్చుకున్న వెంటనే వారిపై ఉన్న కేసులు కనుమరుగవుతున్నాయని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను ఈడీ, సీబీఐ వంటి సంస్థల ద్వారా ఒత్తిడికి గురిచేసి తమ పార్టీలో చేర్చుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదమని, ఇది ఎమర్జెన్సీ కంటే కూడా ఆందోళనకరమైన పరిణామమని పేర్కొన్నారు.విదేశాల్లో భారతీయులు ఇబ్బందులు ఎదుర్కొన్నా లేదా ప్రాణాలు కోల్పోయినా, కేంద్ర ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించడం లేదని అన్నారు. అమెరికా వంటి దేశాలపై కనీసం బహిరంగంగా అభిప్రాయం వ్యక్తం చేయలేని పరిస్థితి ఉంటే, ప్రజాస్వామ్య విలువల గురించి బీజేపీ మాట్లాడడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.దేశవ్యాప్తంగా అనేక పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకుని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని, కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారని అన్నారు. ఇవేనా బీజేపీ చెప్పే "వెలుగుల రోజులు" అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచడం, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం బీజేపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలతో కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతుందని, రానున్న రోజుల్లో ప్రజలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని విశ్వాసం వ్యక్తం చేశారు.కరోనా సమయంలో జరిగిన మరణాలు, పరీక్షల పేపర్ లీకేజీలు, విద్యార్థుల ఆత్మహత్యలు వంటి కీలక అంశాలపై ప్రధాని మోదీ ఒక్కసారి కూడా దేశ ప్రజల ముందు పూర్తి స్థాయిలో మాట్లాడలేదని విమర్శించారు.దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాముని పేరుతో రాజకీయాలు చేస్తూ నిజమైన సనాతన ధర్మాన్ని వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. అయోధ్య రామమందిర నిర్మాణానికి సంబంధించిన విరాళాలు, నిధుల వినియోగంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో, ఈడీ, సీబీఐతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యంగా ఉండే స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఈ అంశాలన్నింటిపై వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఇంద్రాగాంధీని విమర్శించడం కంటే, ఇన్ని సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ తమ పాలనలో ఎన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆసుపత్రులు, నీటి ప్రాజెక్టులు నిర్మించిందో దేశ ప్రజలకు వివరించాలని అన్నారు. నాగార్జునసాగర్ వంటి భారీ ప్రాజెక్టులతో పోల్చి తమ అభివృద్ధి పనులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ లో హిందువుల మీద  ఏదో జరిగిందని రక్తాలు మరిగించుకున్న అంధ భక్తులు. మనదేశంలో హిందూ దేవుడ్నే దోచేస్తే బిజెపి నాయకులు నోరు మూసుకుని కూర్చున్నారు అని,వీళ్ళు రామ భక్తులు కాదు, దొంగ భక్తులు.ఈ అంశాలన్నింటిపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, అయితే నిజాలు చెప్పాల్సిన సందర్భంలో బీజేపీ నాయకులు తప్పించుకుంటున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ పేర్కొన్నారు.

# మాజీ ప్రధానమంత్రి భారతరత్న  పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు  హర్కర వేణుగోపాల్ రావు

హైదరాబాద్ వెలుతురు జూన్ 28:

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ పి.వి. నరసింహారావు గారి 105వ జయంతి సందర్భంగా టీపీసీసీ ప్రెసిడెంట్ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్ మరియు ప్రజాసంబంధాల సలహాదారులు శ్రీ హర్కర వేణుగోపాల్ రావు గారు ఘనంగా నివాళులు అర్పించారు.

శ్రీ పి.వి. నరసింహారావు గారి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ రోజు ఆయన జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నివాళుల కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీ హర్కర వేణుగోపాల్ రావు గారు మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు గారు దేశ ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి భారతదేశ అభివృద్ధి పథాన్ని మార్చిన మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. అపారమైన మేధస్సు, బహుభాషా పాండిత్యం, దూరదృష్టి కలిగిన గొప్ప రాజనీతిజ్ఞుడిగా ఆయన దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.తెలంగాణ గడ్డపై జన్మించిన పి.వి. నరసింహారావు గారి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీ హర్కర వేణుగోపాల్ రావు గారు పేర్కొన్నారు.





# మనసాక్షి అనే నిశిత న్యాయస్థానం

మనిషి జన్మించినప్పటి నుండి మరణించే వరకు అనేక రూపాలను, రంగులను మారుస్తూ ఉంటాడు. సమాజంలో తన ప్రయాణాన్ని సాగిస్తూ ఎన్నో పేర్లను మోస్తాడు. పుట్టినప్పుడు అమాయకత్వానికి ప్రతీకగా బిడ్డ అని, నవయవ్వనంలో అడుగుపెట్టినప్పుడు శౌర్యానికి గుర్తుగా యువకుడు అని, సమాజంలో సంపదను సమకూర్చుకున్నప్పుడు గౌరవంగా శ్రేష్ఠుడు అని, చివరకు అధికారాన్ని లేదా కీర్తిని చేజిక్కించుకున్నప్పుడు మహానుభావుడు అని పిలువబడతాడు. కానీ లోతుగా ఆలోచిస్తే, ఈ పేర్లన్నీ బాహ్య ప్రపంచం ఇచ్చిన ముసుగులు మాత్రమే బయటి నుండి వచ్చి మనపై పడే వెలుగునీడలు. అయితే, ఈ హడావిడి అంతటా ఒక్క పేరు మాత్రం మన జన్మతోనే ముడిపడి, మరణం వరకు నీడలా వెంటే నడుస్తుంది. ఆ నిశ్శబ్ద శక్తే మనసాక్షి.మనసాక్షి అంటే కేవలం పలికే మనస్సాక్షి అనే పదం కాదు. అది మన లోపల నిరంతరం పనిచేసే ఒక అదృశ్య న్యాయస్థానం. మనం సమాజం మధ్యలో కాకుండా ఒంటరిగా ఉన్నప్పుడు, చుట్టూ దట్టమైన చీకటి ఆవరించినప్పుడు, మనల్ని ఎవ్వరూ గమనించడం లేదనే భ్రమలో ఉన్నప్పుడు కూడా మన ప్రతి ఆలోచనను, ప్రతి అడుగును నిశితంగా పరీక్షించే అద్భుత చేతన అది. లోకం ముందు మనం ఎన్నో వేషాలు వేయవచ్చు, నటనలతో అందరినీ మెప్పించవచ్చు కానీ మన లోపలి అంతరాత్మ ముందు మాత్రం ఏ ఒక్క రోజు కూడా మోసం, అబద్ధం పనిచేయవు.భారతదేశంలో సమానత్వం అనే పదం రాజ్యాంగంలో ఎంతో పవిత్రంగా లిఖించబడింది. చట్టం ముందు అందరూ సమానులే అనే భావన ఆధునిక సమాజానికి పునాది. కానీ ఈ సమానత్వం కేవలం చట్టం పుస్తకాల్లో, న్యాయస్థానాల గోడలపై ఉంటే సరిపోదు అది అంతకంటే ముందు ప్రతి మనిషి మనసులో లోతుగా వేళ్ళూనుకోవాలి. బాహ్య ప్రపంచంలో కనిపించే హెచ్చుతగ్గులు అంతరంగానికి వర్తించవు.ఒక ఉన్నత ఐ.ఏ.ఎస్. అధికారిని ఉదాహరణగా తీసుకుందాం. అతడు తన శీతలీకరించిన కార్యాలయంలో ఉన్నతాసనంపై కూర్చొని ఉంటాడు. అతని ముందు వందలాది మంది సిబ్బంది వినయంగా నమస్కరిస్తారు. అతడు తీసుకునే ఒక్కొక్క నిర్ణయం లక్షలాది మంది సామాన్య ప్రజల జీవితాలను, వారి భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. కానీ రోజంతా అధికార దర్పంతో గడిపిన ఆ అధికారి, రాత్రి పడుకోవడానికి వెళ్ళినప్పుడు ఆ నిశ్శబ్ద ఏకాంతంలో తను తీసుకున్న నిర్ణయాలు నిజాయితీగా ఉన్నాయా లేదా అని నిలదీసే ఏకైక న్యాయమూర్తి అతని మనసాక్షి మాత్రమే.అదే విధంగా, ఒక రాజకీయ నాయకుడు వేదికలపై ఎక్కి ప్రజల సంక్షేమం గురించి గంభీరంగా, ఆకర్షణీయంగా మాట్లాడవచ్చు. ప్రజలు చప్పట్లతో అతనిని ఆకాశానికి ఎత్తవచ్చు. కానీ అతని అంతరంగంలో తీసుకునే నిర్ణయాలు నిజంగా సమాజ హితం కోసమా, లేక కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమా అనే దానికి సమాధానం చెప్పవలసింది బయటి సమాజానికి కాదు, లోపల ఉన్న మనసాక్షికే.మరోవైపు, ఒక పేద రైతు తన పొలంలో ఎండనక, వాననక నిరంతరం శ్రమిస్తూ చెమట చిందిస్తాడు. ఆధునిక కార్పొరేట్ సమాజం అతన్ని ఆర్థికంగా అల్పుడు అని, తక్కువ స్థాయి వ్యక్తి అని పరిగణించవచ్చు. కానీ తన కష్టార్జితం నిజాయితీతో కూడుకున్నదా అని అతనికి మనసాక్షి చెప్పే జవాబు అవును అతన్ని ప్రపంచంలోని ఏ ఉన్నత పదవి కంటే కూడా అత్యంత గొప్పగా నిలబెడుతుంది. ఇక్కడే నైతిక తత్వశాస్త్రం యొక్క పరమ సత్యం ఆవిష్కృతమవుతుంది: లోకంలో మనుషుల అంతస్తులు, పదవులు వేరుగా ఉండవచ్చు, కానీ మనసాక్షి అనే త్రాసు ముందు మానవాళి అంతా సమానమే.



ప్రపంచవ్యాప్తంగా నైతిక తత్వశాస్త్ర చరిత్రను పరిశీలిస్తే, ఈ మనసాక్షి అనే భావన వివిధ కాలాల్లో అనేక రూపాల్లో వ్యక్తమవడం కనిపిస్తుంది. గ్రీకు దేశపు గొప్ప తత్వవేత్త సోక్రటీస్ ఒక సందర్భంలో అన్నాడు.అపరీక్షిత జీవితం జీవించడానికి అర్హమైనది కాదు.అంటే, మనం ప్రతి రోజూ మన అంతరంగంలోకి తొంగి చూస్తూ, మన చర్యలను మరియు నిర్ణయాలను నిరంతరం పరీక్షించుకోవాలి. ఆ పరీక్షను అత్యంత కఠినంగా జరిపే అంతర్గత పరీక్షకుడే మనసాక్షి.అలాగే, జర్మన్ తత్వవేత్త ఇమ్మాన్యుయేల్ కాంట్ తన నైతిక సిద్ధాంతంలో కేటగారికల్ ఇంపరేటివ్ గురించి ప్రస్తావించాడు. దీని ప్రకారం, నీవు చేసే ప్రతి చర్య విశ్వవ్యాప్తంగా అందరికీ వర్తించే ఒక సార్వత్రిక నియమంగా మారినా అది సరైనదే అనిపించేలా నీవు ప్రవర్తించాలి. ఈ క్లిష్టమైన నిర్వచనంలో కూడా అంతిమ నిర్ణాయక శక్తిగా నిలిచేది మనసాక్షే.భారతీయ సనాతన తత్వశాస్త్రంలో దీనిని ఆత్మ సాక్షి లేదా అంతరాత్మ అని పిలిచారు. ఉపనిషత్తులు ఎంతో స్పష్టంగా బోధించాయి.ఆత్మానం విద్ధి అనగా నిన్ను నీవు మొదట తెలుసుకో. ఈ తెలుసుకోవడం అనేది బాహ్య ప్రపంచం నీకు ఇచ్చే సర్టిఫికెట్లు లేదా నిర్వచనాల ద్వారా సాధ్యం కాదు. మనసాక్షి మన ముందు ఉంచే నిష్పక్షపాత అద్దం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది.ఇక్కడ మానవ మనస్తత్వానికి సంబంధించిన ఒక ముఖ్యమైన, సంక్లిష్టమైన ప్రశ్న తలెత్తుతుంది. నిత్యం సత్యాన్ని పలికే మనసాక్షిని కూడా మనం మోసం చేయవచ్చా? అంటే, మన స్వార్థ బుద్ధి మనల్ని తప్పుడు మార్గంలో నడిపిస్తూ, అదే సరైన మార్గం అని మన అంతరంగాన్ని నమ్మించగలదా?నిజానికి, ఇది సాధ్యమే. దీన్నే ఆధునిక నైతిక తత్వశాస్త్రంలో సెల్ఫ్ –డెసెప్షన్ లేదా స్వయం మోసం అంటారు. మనిషి తాను చేసే ప్రతి అన్యాయానికి, తప్పుకు ఏదో ఒక కారణాన్ని వెతికి పెట్టుకుంటాడు. ప్రస్తుత పరిస్థితుల్లో నాకు ఇది అవసరం కాబట్టి చేశాను,నా చుట్టూ ఉన్న అందరూ ఇదే చేస్తున్నారు కదా , లేక నా కుటుంబానికి, నా వంశీయులకు లాభం చేకూరుతుంది కదా ఇవన్నీ మన లోపల ఉన్న నైతికతను నిద్ర పుచ్చడానికి మనం చెప్పుకునే మత్తు మాటలు.

కానీ మనసాక్షి అనేది ఎప్పటికీ పూర్తిగా నిద్రపోదు. బహుశా లౌకిక ప్రలోభాల వల్ల అది కొన్నాళ్ళు నిద్రించినట్టు నటించవచ్చు. కానీ జీవితంలో ఏదో ఒక రాత్రి, ఏదో ఒక నిశ్శబ్ద క్షణంలో అది అకస్మాత్తుగా మేల్కొంటుంది. మనం చేసిన తప్పును, నిజాన్ని ముఖంపై కొట్టినట్టు స్పష్టంగా చెప్తుంది. మన జీవితంలో తరచూ వచ్చే అపరాధ భావన , లోపలి అశాంతి, నేను చేసింది సరైన పనేనా? అనే నిరంతర సందేహం ఇవన్నీ మనసాక్షి మనకు పంపే హెచ్చరిక సంకేతాలే. ఇవి మనకు శత్రువులు కావు, నిజానికి మనల్ని కాపాడే పరమ మిత్రులు. ఇవే మనిషిని మళ్ళీ తప్పుడు మార్గం నుండి సన్మార్గంలో నిలబెట్టడానికి సహాయపడతాయి.నేడు మన ఆధునిక సమాజం విలువలు క్షీణించి, అనేక నైతిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. అవినీతి, సామాజిక అసమానత, పర్యావరణ విధ్వంసం, మానవ హక్కుల ఉల్లంఘన ఇవన్నీ కేవలం చట్టాలను మార్చడం వల్ల లేదా కొత్త శిక్షలను ప్రవేశపెట్టడం వల్ల మాత్రమే పూర్తిగా పరిష్కరించబడవు. ఎందుకంటే, చట్టం అనేది కేవలం బయటి నుండి నియంత్రించే ఒక శాసనం మాత్రమే. కానీ మనసాక్షి అనేది మనిషిని లోపలి నుండి నడిపించే ఒక దివ్య శాసనం.ఉదాహరణకు, ఒక వైద్యుడు తన వద్దకు వచ్చిన రోగికి నిజాయితీగా, మానవత్వంతో చికిత్స చేస్తున్నాడా లేదా అనేది అతని మనసాక్షికి మాత్రమే తెలుస్తుంది ఏ వైద్య కమీషన్ లేదా ప్రభుత్వ నిఘా సంస్థ దానిని పూర్తిగా కనిపెట్టలేదు. ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో పిల్లల భవిష్యత్తును నిజంగా తన పవిత్రమైన సేవగా భావించి బోధిస్తున్నాడా లేదా అని అతని మనసాక్షే ప్రశ్నిస్తుంది ఏ తనిఖీ బృందం ఆ అంతరంగాన్ని అడగలేదు.

ఒక తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజంలో బ్రతకడానికి నిజమైన మానవీయ విలువలు నేర్పిస్తున్నారా అని వారి మనసాక్షే పరీక్షిస్తుంది దీనికి ఏ సమాజం ప్రత్యేకంగా పురస్కారం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇందుకే, వ్యక్తుల మనసాక్షి ఆరోగ్యంగా, సజీవంగా ఉన్న సమాజమే నిజమైన ఆరోగ్యకరమైన సమాజంగా వర్ధిల్లుతుంది.మనసాక్షి అనేది ఒక పదునైన కత్తి వంటిది. దానిని నిరంతరం ఉపయోగించకపోతే కాలక్రమేణా దానికి తుప్పు పట్టుకుంటుంది. అదే నైతిక ప్రవర్తనతో నిత్యం ఉపయోగిస్తే, అది మరింత పదునుగా మారుతుంది. మనసాక్షిని నిరంతరం పదును పెట్టుకోవడానికి కొన్ని ముఖ్యమైన మార్గాలు ఉన్నాయి. ప్రతి రోజూ రాత్రి నిద్రపోయే ముందు కొన్ని నిమిషాల పాటు ఏకాంతంగా కూర్చొని, ఆ రోజు మనం చేసిన పనులను, మాట్లాడిన మాటలను మననం చేసుకోవాలి. నేడు నేను చేసిన పని నిజాయితీగా ఉందా? నా వల్ల ఎవరైనా అనవసరంగా బాధపడ్డారా? నేను సరిచేయగలిగిన తప్పు ఏమైనా ఉందా? అని ప్రశ్నించుకోవాలి.లోకంలో ఎవ్వరూ చూడనప్పుడు, మనం ఒంటరిగా ఉన్నప్పుడు కూడా అందరూ సమాజంలో చూస్తున్నప్పటి లాగే నైతికంగా ప్రవర్తించడం ఇదే మనసాక్షిని అంతర్గతంగా బలోపేతం చేస్తుంది. ఇతరుల బాధను, వేదనను మన బాధగా భావించి అర్థం చేసుకోవడం మన మనసాక్షిని ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుతుంది. సహానుభూతి లేని కఠినమైన చోట మనసాక్షి మొద్దుబారిపోతుంది. మన వల్ల ఏదైనా తప్పు జరిగినప్పుడు దానిని కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలు చెప్పకుండా, సమర్థించుకోకుండా, నేరుగా తప్పును ఒప్పుకోవడం మనసాక్షిని గౌరవించే అతి గొప్ప పద్ధతి.బాహ్య ప్రపంచం ఎప్పుడూ తన స్వార్థ ప్రమాణాల ప్రకారం తీర్పులు ఇస్తూనే ఉంటుంది వాటిని మనం ఆపలేము. కానీ లోకం ఇచ్చే తీర్పులు చాలావరకు పాక్షికమైనవి, అసంపూర్ణమైనవి, కొన్నిసార్లు పూర్తిగా అన్యాయమైనవి కూడా కావచ్చు. చరిత్రను తిరగేస్తే, ఒక ఉత్తమమైన మంచి మనిషిని చెడ్డవాడు అని సమాజం ముద్ర వేసి హింసించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఆ బాహ్య నిందలు ఏవీ ఆయా మహానుభావుల అంతర్గత మనసాక్షిని మాత్రం పక్కదారి పట్టించలేకపోయాయి.మహాత్మా గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్, భగత్ సింగ్ వీరందరూ తమ జీవిత కాలంలో లోకం ముందు, అప్పటి ప్రభుత్వాల ముందు తప్పుడు తీర్పులను, జైలు శిక్షలను పొందారు. కానీ వారి అంతరంగంలో మనసాక్షి సజీవంగా, స్పష్టంగా ఉంది కాబట్టే, వారి ఆత్మ ఏ శక్తికీ చలించలేదు.

ఆ ధైర్యమే వారిని చరిత్రలో అమరులను చేసింది.అందుకే, మానవ జీవితంలో అన్నింటికంటే ఒకే ఒక్క లక్ష్యం అత్యంత ముఖ్యమైనది మన అంతర్గత మనసాక్షిని సంతృప్తిపరచడం. సమాజంలో పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. సంపదలు మారుతుంటాయి. పేరు ప్రఖ్యాతులు కూడా కాలంతో పాటు కరిగిపోతాయి. కానీ ఏ పరిస్థితిలోనైనా తన మనసాక్షి ముందు తల ఎత్తుకుని నిలబడే సాహసం ఉన్న వ్యక్తి మాత్రమే ఈ భూమిపై జన్మను సార్థకం చేసుకున్న వ్యక్తి. రాజు అయినా, బిచ్చగాడు అయినా, మహా పండితుడు అయినా, పామరుడు అయినా మనసాక్షి అనే నిశిత న్యాయస్థానం ముందు మనమంతా సమానమే. ఆ అంతర్గత సమానత్వమే నిజమైన మానవ గరిమ. ఆ గరిమను, పవిత్రతను కాపాడుకోవడమే ప్రతి ఒక్కరి నిజమైన జీవన నైతికత.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# ప్రజాస్వామ్యానికి పరీక్షగా మారిన ఫిరాయింపులు..!

భారత ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా గుర్తింపు పొందింది. విభిన్న రాజకీయ అభిప్రాయాలు, ప్రాంతీయ ఆకాంక్షలు, సామాజిక వర్గాల ప్రయోజనాలు, భాషా–సాంస్కృతిక వైవిధ్యాలను సమన్వయం చేస్తూ ఈ వ్యవస్థ గత ఏడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. అయితే ఇటీవలి కాలంలో దేశ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యం గురించి ఆందోళనలను పెంచుతున్నాయి. ముఖ్యంగా పార్టీ ఫిరాయింపులు, ఎన్నికైన ప్రజాప్రతినిధుల భారీ స్థాయిలో రాజకీయ పక్షమార్పులు, ప్రతిపక్ష పార్టీల బలహీనత, అధికార కేంద్రీకరణ వంటి అంశాలు ప్రజాస్వామ్య విలువలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు కేవలం రాజకీయ సమీకరణాల మార్పుగా మాత్రమే కాకుండా, రాజ్యాంగ వ్యవస్థ, ఎన్నికల రాజకీయాలు, ప్రజల విశ్వాసం వంటి మౌలిక అంశాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి.భారత రాజకీయ చరిత్రలో పార్టీ ఫిరాయింపులు కొత్త విషయం కావు. 1967లో ఉత్తరప్రదేశ్‌లో చరణ్‌సింగ్ నేతృత్వంలో జరిగిన రాజకీయ పరిణామాల నుంచి ప్రారంభమైన ఈ ధోరణి తర్వాతి దశాబ్దాల్లో అనేక రూపాల్లో కనిపించింది. ఒకప్పుడు అధికార మార్పిడి కోసం, ప్రభుత్వాల ఏర్పాటు లేదా కూల్చివేత కోసం జరిగే ఫిరాయింపులు నేడు మరింత విస్తృత రాజకీయ లక్ష్యాలకు సాధనంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికార పక్షంలో చేరిన సందర్భాలు వరుసగా నమోదవుతున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, గోవా, మణిపూర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలు ఈ ధోరణికి ఉదాహరణలుగా నిలిచాయి.ఇటీవలి కాలంలో తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే వర్గం) వంటి పార్టీలలో చోటుచేసుకున్న చీలికలు, ఫిరాయింపులు కొత్త రాజకీయ చర్చలకు దారితీశాయి. అధికార పార్టీ ప్రత్యర్థి పార్టీలలో అసంతృప్తిని ప్రోత్సహిస్తూ, నాయకులను ఆకర్షిస్తూ తన రాజకీయ బలాన్ని పెంచుకుంటోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పదవులు, అధికార అవకాశాలు, రాజకీయ భవిష్యత్తు వంటి అంశాలు ఈ మార్పులకు కారణమవుతున్నాయని విమర్శకులు చెబుతున్నారు. అయితే అధికార పక్షం మాత్రం ఇవి స్వచ్ఛంద రాజకీయ నిర్ణయాలేనని, ప్రజలు అభివృద్ధి రాజకీయాలను కోరుకుంటున్నందువల్లే నాయకులు తమవైపు వస్తున్నారని వాదిస్తోంది.ఈ నేపథ్యంలో మరో ముఖ్యమైన చర్చ రాజ్యాంగ సవరణల చుట్టూ తిరుగుతోంది. సాధారణ చట్టాలకు సరిపడే సాధారణ మెజారిటీతో పోలిస్తే రాజ్యాంగ సవరణలకు ప్రత్యేక మెజారిటీ అవసరం. ఈ ప్రత్యేక మెజారిటీని రాజ్యాంగ నిర్మాతలు ఉద్దేశపూర్వకంగానే ఏర్పాటు చేశారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని తరచుగా మార్చకుండా నిరోధించడమే దీని ప్రధాన లక్ష్యం. రాజ్యాంగ సభలో జరిగిన చర్చల సమయంలో కొందరు సభ్యులు సాధారణ మెజారిటీతోనే సవరణలు చేయవచ్చని సూచించినప్పటికీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాత్రం రాజ్యాంగ స్థిరత్వం కోసం మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారాన్ని నియంత్రించే వ్యవస్థలు, సమతుల్యతను కాపాడే యంత్రాంగాలు బలంగా ఉండాలంటే ప్రత్యేక మెజారిటీ అవసరమని ఆయన నొక్కి చెప్పారు.అయితే ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ సాధించడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని కూడగట్టే ప్రయత్నాల్లో భాగంగానే కొన్ని ఫిరాయింపులు జరుగుతున్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన, రాజ్యాంగ సవరణలు లేదా ఇతర కీలక చట్టపరమైన మార్పుల కోసం సంఖ్యాబలం పెంచుకోవాలనే ఆలోచన అధికార పక్షంలో ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లోక్‌సభలో, రాజ్యసభలో అధికార కూటమి బలం క్రమంగా పెరుగుతుండడం ఈ చర్చలకు మరింత ఊతమిస్తోంది.ఈ పరిస్థితిని కేవలం రాజకీయ వ్యూహంగా మాత్రమే చూడటం సరైంది కాదు. ఎందుకంటే ఎన్నికల సమయంలో ప్రజలు ఒక అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవడం కాదు, అతను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ సిద్ధాంతాన్ని, ఎన్నికల హామీలను, రాజకీయ దిశను కూడా సమర్థిస్తారు. అలాంటి సందర్భంలో ఎన్నికైన తర్వాత ఆ ప్రజాప్రతినిధి మరో పార్టీలో చేరితే అది ఓటర్ల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉంటే, ఆ తీర్పును మధ్యలో మార్చే హక్కు ప్రజాప్రతినిధికి ఎంతవరకు ఉండాలనే ప్రశ్న కూడా ఇక్కడ ఉత్పన్నమవుతుంది. అందుకే ఫిరాయింపుల నిరోధక చట్టం రూపొందించబడింది. అయినప్పటికీ చట్టంలోని లొసుగులు, స్పీకర్ల నిర్ణయాల్లో జాప్యం, రాజకీయ ఒత్తిళ్లు వంటి కారణాల వల్ల ఈ చట్టం ఆశించిన ఫలితాలను పూర్తిగా ఇవ్వలేకపోతోందన్న విమర్శలు ఉన్నాయి.పార్టీ ఫిరాయింపులు పెరగడం వల్ల ప్రతిపక్ష రాజకీయాల బలహీనత కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం ఎంత ముఖ్యమో, బలమైన ప్రతిపక్షం కూడా అంతే అవసరం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించడం, ప్రజా సమస్యలను సభలలో ప్రస్తావించడం వంటి బాధ్యతలను ప్రతిపక్షం నిర్వర్తిస్తుంది. కానీ వరుస ఫిరాయింపుల వల్ల ప్రతిపక్ష పార్టీలు బలహీనపడితే ప్రజాస్వామ్య సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఒకే పార్టీ లేదా ఒకే కూటమి ఆధిపత్యం పెరిగినప్పుడు నిర్ణయ ప్రక్రియలో విభిన్న స్వరాలకు తగిన ప్రాధాన్యం దక్కకపోవచ్చు. ఇది దీర్ఘకాలంలో ప్రజాస్వామ్య చైతన్యాన్ని బలహీనపరిచే ప్రమాదాన్ని కలిగిస్తుంది.భారతదేశం వంటి బహుళత్వ సమాజంలో ఈ అంశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. భాషలు, సంస్కృతులు, ప్రాంతీయ ఆకాంక్షలు, సామాజిక వర్గాల ప్రయోజనాలు పరస్పరం భిన్నంగా ఉండే దేశంలో రాజకీయ వైవిధ్యం సహజమైన అవసరం. ఆ వైవిధ్యాన్ని ప్రతిబింబించే రాజకీయ శక్తులు బలహీనపడితే ప్రజాస్వామ్యం యొక్క అసలు స్ఫూర్తి దెబ్బతినే అవకాశం ఉంది. అందువల్ల రాజకీయ పోటీని పూర్తిగా తొలగించి ఏకపక్ష ఆధిపత్యానికి దారితీసే ఏ ధోరణినైనా ప్రజాస్వామ్య దృష్టితో పరిశీలించడం అవసరం.అదే సమయంలో ఫిరాయింపుల వెనుక ఉన్న కారణాలను కూడా సమగ్రంగా అర్థం చేసుకోవాలి. ప్రతి ఫిరాయింపునూ కుట్రగా లేదా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా చిత్రీకరించడం సరైంది కాదు. కొన్ని సందర్భాల్లో రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం, నాయకత్వ వైఫల్యాలు, ప్రాంతీయ అసంతృప్తి, వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుపై ఆందోళనలు వంటి కారణాలు కూడా నాయకులను పార్టీలు మార్చేలా చేస్తాయి. కాబట్టి సమస్యను కేవలం ఒక రాజకీయ పార్టీకి పరిమితం చేయకుండా, భారత రాజకీయ వ్యవస్థలోని నిర్మాణాత్మక బలహీనతల దృష్టితో కూడా చూడాలి.ఈ నేపథ్యంలో రాజకీయ సంస్కరణల అవసరం మరింత స్పష్టమవుతోంది. ఫిరాయింపు కేసులపై వేగవంతమైన విచారణ, స్పీకర్ అధికారాలపై స్వతంత్ర పర్యవేక్షణ, రాజకీయ నిధుల పారదర్శకత, ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ మారితే తప్పనిసరిగా ప్రజా తీర్పు పొందే విధానాలపై చర్చ జరగాలి. అలాగే రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కూడా అత్యవసరం. పార్టీ నాయకత్వ నిర్ణయాల్లో సభ్యుల భాగస్వామ్యం పెరిగితే అసంతృప్తి, విభేదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

భారత రాజకీయాలు ప్రస్తుతం వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు అసాధారణంగా భావించిన రాజకీయ చర్యలు నేడు సాధారణ రాజకీయ వ్యూహాలుగా మారుతున్నాయి. అధికార సమీకరణాలు, రాజకీయ పునర్వ్యవస్థీకరణలు, కొత్త కూటములు, పార్టీ చీలికలు ఎన్నికల రాజకీయాల్లో భాగమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎదుర్కొంటున్న సవాళ్లు, మహారాష్ట్రలో శివసేన మరియు ఎన్‌సీపీ విభజనలు, ఇతర రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు ఈ విస్తృత రాజకీయ ధోరణికి ప్రతీకలుగా కనిపిస్తున్నాయి.

చివరికి ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయాధికారం ప్రజలదే. రాజకీయ పార్టీలు ఎంతటి వ్యూహాలు రచించినా, నాయకులు ఎన్ని సమీకరణాలు మార్చినా, ఎన్నికల సమయంలో ప్రజలే తుది తీర్పు ఇస్తారు. అయితే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు. రాజ్యాంగ విలువలు, రాజకీయ నైతికత, ప్రతిపక్షానికి గౌరవం, ప్రజా తీర్పుకు విధేయత, అధికారంపై నియంత్రణ వంటి అంశాలు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ విలువలను కాపాడుతూ రాజకీయ పోటీ కొనసాగినప్పుడే భారత ప్రజాస్వామ్యం తన బలాన్ని, వైవిధ్యాన్ని, విశ్వసనీయతను నిలబెట్టుకోగలదు. ఫిరాయింపుల రాజకీయాలు తాత్కాలికంగా అధికార సమీకరణాలను మార్చవచ్చు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థ దీర్ఘకాలిక ఆరోగ్యం కోసం రాజకీయ నాయకులు, పార్టీలు, రాజ్యాంగ సంస్థలు మరియు ప్రజలు సమాన బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యానికి బలం అధికార కేంద్రీకరణలో కాదు, భిన్న స్వరాలకు, విభిన్న అభిప్రాయాలకు, ప్రజా తీర్పుకు ఇచ్చే గౌరవంలోనే ఉంటుంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని: చంద్రారెడ్డి

**కూకట్ పల్లి జూన్ 28 వెలుతురు:**



తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల లోపు పిల్లలకు క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేసిస్తూ వారికి బంగారు భవిష్యత్తు ను అందిస్తూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఫల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా బస్తి లోని శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం కమిటీ హాల్లో అధికార, సిబ్బంది నిర్వహించిన పోలియో కార్యక్రమాన్ని చంద్రారెడ్డి ప్రారంభించి పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో నేతలు పేర్ని ధర్మారావు. ఆర్ భగవంత రెడ్డి, నరసింహులు ముదిరాజ్, ఏ.భూపాల్ రెడ్డి, ఆడెపు ప్రభాకర్, తిరుపతిరెడ్డి, శంకర్ రెడ్డి,తాటి కిరణ్, సత్యనారాయణ రెడ్డి, జి.వసంత రెడ్డి, వి.యాదవ రెడ్డి, జె.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకు సమాజమంతా బాధ్యత వహించాలి: జన సేన నాయకులు ముమ్మా రెడ్డి ప్రేమ కుమార్

**కూకట్ పల్లి, జూన్ 28 వెలుతురు:**


యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూకట్ పల్లి నియోజకవర్గ జన సేన పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మా రెడ్డి ప్రేమ కుమార్ పిలుపు నిచ్చారు. కూకట్ పల్లి కేపీహెచ్‌బీ కాలనీ 1వ, రోడ్డు లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఛత్రపతి ధర్మ రక్షణ సేవ అధ్యక్షుడు కర్రా వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "సే నో టు డ్రగ్స్" అవగాహన ర్యాలీ కి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ 5వ, రోడ్డు వరకు యువతతో కలిసి కొనసాగింది.ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మత్తు పదార్థాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండటమే కాకుండా వాటి నిర్మూలన లోనూ




ముందుండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుని, వాటిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. మత్తు పదార్థాల విక్రయదారు లపై కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంచి, వారిని చెడు అలవాట్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తమపై కూడా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగేష్ ప్రభు, డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ రమేష్, నాగేశ్వర్ గుప్తా, జి. ప్రసాద్, అనిత గాలి యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. ర్యాలీలో జన సేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, మండలి అనిల్, రణదీప్, ప్రసాద్ నాయుడు, ప్రవీణ్, ఇతర రాజకీయ నాయకులు దీపక్ చౌదరి, హరిబాబు, శ్రావణ్ లతో పాటు కాలనీ వాసులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొని మత్తు పదార్థాల నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు.

# SIR లు అందజేసిన అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**బషీర్ బాగ్ వెలుతురు 28 జూన్ :**



అంబర్ పేట్ బాపునగర్ లో జరుగుతున్న SIR లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గారు స్థానిక BLO, BLA , బిఆర్ఎస్ ఉద్యమ నాయకుడు మల్లికార్జున్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ తో కలిసి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫామ్ లు అందించడం జరిగింది. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ గారు మాట్లాడుతూ ఓటర్లు కచ్చితంగా తమ ఎన్నిమరేషన్ ఫామ్ ని పూర్తి చేసి BLO లకు అందజేయాలని లేదంటే ఓటు కోల్పోయే అవకాశం ఉంటదని తెలియజేశారు. కొత్త ఓటర్లు ఫారం 6 ను, ఓటు బదిలీ చేసుకోవాలనుకున్నవారు ఫారం 8 ను అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ఎన్నికల కమిషన్ పారదర్శకంగా SIR ప్రక్రియను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కన్నం జాకీ బాబు, విజయ నాయక్, చలం, మహమ్మద్ అమీర్, మోసిన్, ఇబ్రహీం , ముజ్జు, రాహుల్, అక్షయ్, హరీష్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తాపూర్ గ్రామంలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం జ్యూట్ బ్యాగులు పంపిణీ

- పేదరికాన్ని జయించాలి సమాజంలో ఆదర్శంగా నిలవాలి
- ప్రస్తుత మీ పరిస్థితులకు నేను అండగా ఉంటా
- బిఅర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి

**మంచాల వెలుతురు జూన్ 28:**

మంచాల మండలం చిత్తాపూర్ తాళ్లపల్లిగూడ గ్రామాల్లో పర్యటించిన బిఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మ న్ బూడిద రాంరెడ్డి ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామాలకు చెందిన మహమ్మద్ హైమ జుట్టు రాజ్యలక్ష్మిలా చదువుల కోసం ఆర్థిక సహాయంగా ఒక్కొక్కరికి10వేల రూపాయలు అందజే సిన ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి సమా జంలో మీతల్లిదండ్రులు గర్వించే విధంగా సమాజానికి మీరు ఆదర్శంగా నిలవాలని అన్నారు అ నంతరం తాళ్లపల్లిగూడ గ్రామంలో పేద కుటుంబల ఆర్థిక పరిస్థితులు మరియు ఆరోగ్య పరిస్థితు లు సహకరించని కుటుంబాలను పరామర్శించి కావాలి వెంకటేష్ పంది మల్లేష్ కోమటి రాము అ వుసలి ప్రభాకర్ ఏర్పుల సుధాకర్ కుటుంబాలకు10 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అం దించారు మరియు చిత్తపూర్ తాళ్ళపల్లిగూడలో బిఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ ఓ వాట ర్ ప్లాంట్ వాటర్ ఫిల్టర్ ప్లాస్టిక్ నివారణ అవగాహన కార్యక్రమంతో పాటు మహిళలకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ గ్రా మాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా దృష్టికి తీసుకువస్తే నాకు తోచిన సేవా సహాయం చేస్తాను ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటాను అనిఅన్నారు గ్రామాల్లో త్రాగునీటి సమస్య ఎక్కడ ఉన్న బోర్లు వేయిస్తాను వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తాను అనిఅన్నారు



కార్యక్రమంలో చిత్తపూర్ గ్రామ పెద్దలు చంద్రయ్య నాగ రాజు వార్డు సభ్యులు తాల్లగూడ గ్రామ పెద్దలు శంకర య్య.రాజేష్ శ్రీనివాస్ రెడ్డి సుకన్య శేఖర్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు నందకుమార్ పున్నం రాము జాపాల గ్రామసర్పంచ్ రవి మడుపు గోపాల్ బకున చందు మహమ్మద్ సద్దాం మంచాల గ్రామ పె ద్దలు రావుల శంకర్ అశ్వాల బాలరాజు బండలేమూర్ గ్రామ పెద్దలు సుదర్శన్ లింగం మోహన్ మ రియు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

**బషీర్ బాగ్ వెలుతురు 28 జూన్ :**



పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీరామ కాలనీ సోషల్ వర్కర్ పి. నాగలక్ష్మి అన్నారు. ఆదివారం పోలియో దినోత్సవం సందర్భంగా ఐదు సంవత్సరంలో పిల్లలకు పోలియో టీకాలు వేయించాలని ఆమె కోరారు. పోలియో టీకాల వేయించడం ద్వారా చిన్నారులకు అంగవైకల్యం చెందకుండా ఉంటుందని స్పష్టం చేశారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పోలియో టీకాలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు.

# దూదేకుల, నూర్ భాషా జేఏసీ చైర్మన్గా బాబ్జాన్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**

సుల్తాన్ బజార్లో బీసీసీఇ భవన్లో దూదే కుల,నూరు బాషా కుల సంఘాల సమావేశం జరిగింది సమావేశాని కి మొయినుద్దీన్. బాబ్జాని అధ్యక్షతన అన్ని దూదేకుల కుల సంఘాలు కలిసి దూదేకుల జేఏసీగా ఏర్పాటు చేయడం జరిగింది జేఏసీ చైర్మన్గా బాబ్జా న్ వైస్ చైర్మన్ గా హుస్సేన్, ప్రధాన కార్యదర్శులుగా రాజమహమ్మద్, సైదులు, జానీ బాయ్, భాష, సుభాన్, గ్రేటర్ హైదరాబాద్ జేఏఎస్ అధ్యక్షులుగా మోహినుద్దీన్ పాషా మహిళా అధ్యక్షురాలు ఖాజాబీ, యువజన సంఘం అధ్యక్షులుగా ఇమామ్, నాగూర్ భాష, ఎండి హుస్సేన్ ఈ కార్యవర్గం ప్రభుత్వానికి మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది ఈ సమావేశానికి రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ పాల్గొని తన జాతికి సందేశం ఇచ్చారు దూదేకుల ఫెడరేషన్ ఏర్పాటు



చేసి దానికి 50 కోట్లు బడ్జెట్ వెంటనే కేటాయించాలని తీర్మానించారు మిగతా ఫెడరేషన్ ప్రకారం దూదేకుల ఫెడరేషన్ నామినేట్ బాడీ ఏర్పాటు చేసి కార్యవర్గం డైరెక్టర్లను ప్రకటించాలి కోకాపేట్ లో గత ప్రభుత్వం దూదేకుల కులానికి కేటాయించిన భూమిని దూదేకుల సంఘానికి కేటాయించి రెండు కోట్ల తో కుల భవనం ఏర్పాటు చేయాలని జేఏసీ కమిటీ డిమాండ్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వానికి గత 20 ఏళ్ల నుండి దూదేకుల కులస్తులు జెండా మోశారు వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి వారుని గౌరవం కల్పించాలని జేసి తీర్మానం చేశారు ఉమ్మడి జిల్లాలలో దూదేకుల కులస్తులకు ప్రభుత్వ భూమిని కేటాయించి వారి దూదేకుల కమిటీ హాల ను ప్రభుత్వమే కట్టి ఇవ్వాలని తీర్మానించారు . దూదేకుల నూర్ భాషా సంఘంలో వేరువేరు సంఘాలు ఉన్న ఈరోజు ఒకటై జేఏసిని ఏర్పాటు చేసుకున్నా మేమంతా ఒకటే మేమందరం ఒకటే అని మా సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు తెలంగాణ నుండి అన్ని ఉమ్మడి జిల్లాల నుండి అధ్యక్షులు కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొని జేఏసీ ఎన్నుకోవడం జరిగింది.

# 5 సంవత్సరాల లోపు పిల్లలకి పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**



ఆదివారం రోజున ఐదు సంవత్సరాల లోపు పిల్లలకి పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్లోని పలుచోట్లో ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, డాక్టర్ మరియు బస్తీ ప్రెసిడెంట్ శివ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు సాయి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరానికి విశేష స్పందన.. 50 మందికి ఉచిత వైద్య పరీక్షలు...

**కూకట్ పల్లి, జూన్ 28 వెలుతురు:**

వివేకానంద నగర్ కాలనీ మెయిన్ రోడ్డులో యూనియన్ బ్యాంకు సమీపంలోని వద్దేపల్లి నర్సింగరావు కాంప్లెక్స్‌లో ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 50 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేయడంతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి కి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు




నిర్వహించారు. శిబిరంలో టెక్నీషియన్లు దేవేందర్, సాయి, నర్సింగ్ సిబ్బంది నిర్మల, భవాని వైద్య పరీక్షల నిర్వహణలో సేవలందించారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా సాధారణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. సమాజ సేవా దృక్పథంతో డాక్టర్ శ్వేత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను తరచూ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి. ప్రసాద్, ఎస్. శ్రీధర్, లక్ష్మణరావు, సి.కె. రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొని డాక్టర్ శ్వేతతో పాటు వైద్య బృందాన్ని అభినందించారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ మెడికల్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నీటి లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి: పంతుల సాయికుమార్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 28:**



జగద్గిరిగుట్ట రింగుబస్తి రోడ్డులో ఏళ్లుగా కొన సాగుతున్న నీటి లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఎఎస్ యుఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,TPCC రాష్ట్ర నాయకులు పంతుల సాయికుమార్ పటేల్ అధికారులను కోరారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట కన్యాకా పరమేశ్వరి ఆలయం నుండి రింగుబస్తి రోడ్డు మార్గంలో, వేద పాఠశాల ఎదురుగా ఏళ్లుగా నిరంతరంగా రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. స్థానికుల సమాచారం ప్రకారం ఈసమస్య కొత్తది కాదు. గత ప్రభుత్వ హయాం నుంచే ఈ ప్రాంతంలో వస్తున్న నీటిని గోవిందరాజ స్వామి కోనేరులోకి మళ్లించే ఏర్పాటు ఉండేదని స్థానికులు చెబుతున్నారు.తాజాగా HYDRAA చర్యల నేపథ్యంలో కోనేరు ప్రాంతంలో మార్పులు జరిగిన తర్వాత, ఆ నీరు మళ్లించే మార్గం మూసుకుపోవడంతో ప్రస్తుతం అదే నీరు రోడ్డుపైకి వస్తోందని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై సంబంధిత శాఖలు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. ఈనీరు జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి వస్తోందని కొందరు, భద్రకాళి ఆలయం వెనుక ప్రాంతం ఊడ నుంచి వస్తోందని మరికొందరు, ఇంకొందరు డ్రైనేజ్ నీరని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు మంచినీరా? డ్రైనేజ్ నీరా? అనే విషయాన్ని అధికారులు వెంటనే నిర్ధారించాలి.ప్రస్తుతం కన్యాకా పరమేశ్వరి ఆలయం నుండి ఫంక్షన్ హాల్ మీదుగా మగ్దుం నగర్ రోడ్డు వరకు ప్రతిరోజూ నీరు ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్లు దెబ్బతినడం, దోమల వ్యాప్తి, దుర్వాసన, ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందన్నారు.అందువల్ల GHMC, హైదరాబాద్ వాటర్ బోర్డు, డ్రైనేజ్ శాఖ, HYDRAA తదితర సంబంధిత అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి, నీటి మూలాన్ని గుర్తించి, శాశ్వత డ్రైనేజ్ లేదా పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఈ సమస్యకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో పరమేష్, జీవన్, రాహుల్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు చుక్క లే చిన్నారి జీవితానికి పెద్ద రక్షణ" — పల్స్ పోలియో కార్యక్రమంలో మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

**కూకట్ పల్లి జూన్ 28 వెలుతురు:**

చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి శాశ్వతంగా రక్షించేందుకు నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకుని ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని బాలానగర్ డివిజన్ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపునిచ్చారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్ లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. అనంతరం మాట్లాడుతూ "రెండు చుక్క లే చిన్నారి జీవితానికి పెద్ద రక్షణ" అని పేర్కొన్నారు. దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టడం లో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజలు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది సేవలను ఆయన అభినందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు,



అధికారులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నామాపురం గ్రామంలోపల్స్ పోలియో కార్యక్రమం పిల్లల ఆరోగ్యానికి రక్షణ కవచం

**నామాపురం వెలుతురు జూన్ 28:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజం నుంచి పోలియోను నిర్మూలించడమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది.పల్స్ పోలియో చుక్కలను 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలు. ఈ కార్యక్రమాన్ని ద్వేషించి కంచుకట్ల సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. బూత్‌లు మరియు బృందాలు: పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి అవసరమైన బూత్‌లు, సంచార బృందాలు, మరియు హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40.97 లక్షల నుంచి 49.20 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకొని. ప్రభుత్వ ప్రాధాన్యత పోలియో రహిత





సమాజాన్ని సాధించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రదర్శనలు, ప్రతిజ్ఞలు వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నామాపురం సర్పంచ్ భీమనపల్లి రామయ్య పిల్లలకు చుక్కలు వేసి ప్రారంభించారు .ఉప సర్పంచ్ కంచుకట్ల సుదర్శన్, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి కంచుకట్ల సుభాష్, సురిగి మారయ్య, జాజుల యాదయ్య హెల్త్ వర్కర్ వేమనపల్లి అరుణ చనగొని యాదయ్య సురిగి నరసింహ సొల్లేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హౌస్ అరెస్ట్

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 28:**



ఆదివారం రోజు నల్లగొండ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నార్కట్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు గృహ నిర్బంధం (హౌస్ అరెస్ట్) చేశారు.ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ, "ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయలేక ప్రజల్లో వ్యతిరేకతను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నాయకులను గృహ నిర్బంధాలకు గురి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవడం ద్వారా ప్రజల గొంతును అణచివేయలేరని, హౌస్ అరెస్టులు, అక్రమ నిర్బంధాలతో ప్రభుత్వ వైఫల్యాలను దాచలేరని అన్నారు.ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను విరమించి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కక్షసాధింపు రాజకీయాలను మానుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సౌర విద్యుత్ తో రైతులకు ప్రయోజనం

- **పి ఎం. కుసుమ్ ఆధ్వర్యంలో మొదటి ప్లాంట్**
- **రామన్నపేటలో సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం**



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28:**

మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఆదివారం సౌర విద్యుత్ ప్లాంటును ట్రాన్సకో ఎస్. ఈ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్లింకో ఎనర్జీ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మనోడి మాట్లాడుతూ సౌర విద్యుత్ తో రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. తెలంగాణాలో మొట్టమొదటి సోలారప్లంట్ రామన్నపేట లో ప్రారంభించమని అన్నారు. రాబోవు రెండు వారాల్లో తెలంగాణ వ్యాప్తంగా 10 నుండి 15 ప్లాంట్ లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పి సి భాగస్వామ్యం గా స్లింకో ఎనర్జీ ఇంజనీరింగ్ పూర్తి స్థాహి మద్దతుతో ప్రాజెక్టు లను అమలు చేసిందని తెలిపారు.ఈ సందర్భంగా ప్లాంట్ యజమానులు జీవనరెడ్డి, పద్మారావు లను అభినందించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డి .ఈ మల్లికార్జున్, డి. ఈ. ఎం ఆర్ టి విజయ భాస్కర్, ఏ డి ఈ శ్రీకాంత్, ఏ. ఈ. కోటేశ్వరరావు, సబ్సటేషన్ సిబ్బంది, ప్రాజెక్ట్ డెవలపర్స్, సింకో ఇంజనీర్స్ పాల్గొన్నారు.

# ఎసల్ల హాసిని పుష్పాలంకరణ వేడుకకు హాజరైన గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్

- **హాసిని కి పట్టు వస్త్రాలు బహుకరించి ఆశీర్వదించిన సమ్మిగౌడ్ చిలువేరు ..**

**కేసముద్రం వెలుతురు జూన్ 28:**

కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువనాయకుడు ఎసల్ల రాజు– సావిత్రి దంపతుల కుమార్తె కుమారి హాసిని పరిపుష్పలంకరణ ఒడినింపుట వేడుక ఆదివారం రాజు నివాసంలో బంధుమిత్రులు, స్థానిక గ్రామస్థులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్ చిలువేరు ముఖ్య అతిథిగా హాజరైహాసినికి హాసినితో పాటు రాజు కుటుంబానికి పట్టు



వస్త్రాలు బహుకరించి ,సరస్వతి కటాక్షం తో హాసిని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యంతో సుఖసంతోషాల మధ్య ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు . ఇలాంటి ఆచారాలను భావితరాలకు అందించడం ప్రతి కుటుంబ బాధ్యత" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మిగౌడ్ తో ఉప్పరపల్లి వార్డ్ సభ్యులు జనగల అనిల్, జీజుల సందీప్, బండారు గోపి, పలుస వెంకన్న, తండ సంపత్, మంద ప్రవీణ్,మిత్రులు చాగంటి రాములు, పలుస ఉపేందర్, బోనగిరి రమేష్, బోనగిరి దేవేందర్, సకినాల మల్లేష్, చాగంటి శ్రీనివాస్, నరేష్, రంజిత్, ప్రవీణ్, మోహన్, రాకేష్ తదితరులు పాల్గొని హాసినికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విచ్చేసిన అతిథులకు నిర్వాహకులు సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుక ఆహ్వానితులను ఆకట్టుకుని పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# ఇంద్ర పాలనగరం గ్రామంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28:**


గ్రామం ఇంద్రపాలనగరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 0–5 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకోసం ఆదివారం రోజున నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం లో సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.తల్లి తండ్రులు మీ 0–5సంవత్సరాల లోపు వయసున్న పిల్లలందరికి పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజం నిర్మించాలన్నారు .ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల స్వామి జయసుధ, ఎంపీహెచ్ఏ సునీత , ఆశ వర్కర్ లు వరమ్మ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



# సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులను ఖండించిన చింతపల్లి బయన్న


**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 28:**

ముఖ్యమంత్రి నల్గొండ పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సీపీఎం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అరెస్టు చేసిన నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెల్లవారుజాము నుంచే సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్, జిల్లా నాయకులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, చిన్నపాక లక్ష్మీనారాయణ, ఎండి సలీం తదితరులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ప్రజల సమస్యలను ప్రశ్నించే గొంతుకలను ముందస్తు అరెస్టులతో అణచివేయడం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించి గ్రామాలకు పిల్ల కాలువల నిర్మాణ పనులను



పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చెరుకు పెద్దులు, ఆమనగంటి ఐలయ్య, దండు రవి తదితరులు పాల్గొన్నారు.

# సిరిపురం లో నూతన సిరి స్టోన్ మెటల్ క్రషర్ ప్రారంభం





- **ప్రారంభానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28:**

సిరిపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సిరి స్టోన్ మెటల్ క్రషర్" ను భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విప్ లు నకిరేకల్ ఎమ్మెల్యే, ఆలేరు ఎమ్మెల్యే వేముల వీరేశం , బీర్ల అయిలన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కంపెనీ డైరెక్టర్ సిరిగిరెడ్డి సంజీవ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. వారితో మార్కెట్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి మండల నాయకులు గ్రామ నాయకులు వివిధ సర్పంచులు తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కక్కిరేణి గ్రామ దళితవాడల్లో సర్వే నిర్వహణ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28:**

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కక్కిరేణి గ్రామంలోని దళితవాడల్లో ప్రజల జీవన స్థితిగతులు, ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, మౌలిక సదుపాయాల పరిస్థితి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుందం, మండల కార్యదర్శి కందుల హనుమంతు పాల్గొని మాట్లాడుతూ, గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రధానంగా ఈ డిమాండ్లు చేశారు. ఎస్సీ కాలనీల్లో ప్రజల



భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కమిటీ హాలుకు ప్రహరీ గోడ నిర్మించాలి. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు , వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలి.భూమి లేని పేద కుటుంబాలకు నెలకు రూ.12,000 ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. ద ళిత వాడ ల్లో నివసిస్తున్న ప్రజల సమస్యలను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టి సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు వేముల సైదులు, కాలనీ ప్రజలు అనిత, నరేష్, నీరజ, దేవేందర్, ముత్తమ్మ, మాతమ్మ, నరసింహ, కవిత తదితరులు పాల్గొన్నారు.ఇట్లు వ్యవసాయ కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ.

# కొమ్మాయిగూడెం నర్సరీ లో ఇంకుడు గుంతలకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28:**

గ్రామం కొమ్మాయిగూడెం నర్సరీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి .ఈ కార్యక్రమం లో గ్రామ సెక్రటరీ ఉపేందర్ ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మోటే మారయ్య, వార్డు సభ్యులు అంబాల అశోక్, బుర్ర శ్రీశైలం మరియు గోలి అంజయ్య, కల్లూరి శివకుమార్, దగ్గుల లెనిన్, కొండగడప శంకరయ్య, ఎర్ర నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# మోత్కూర్ మున్సిపాలిటీ 12వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ

**మోత్కూర్, జూన్ 28,వెలుతురు న్యూస్ :**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ మెంట రమణ నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా మెంట రమణ నాగేష్ మాట్లాడుతూ, పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని చిన్నారులను పోలియోతో పాటు ఇతర అంటువ్యాధుల బారిన పడకుండా కాపాడాలని సూచించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పోలియో మహమ్మారిని అరికడదాం

- **పనకబండ సర్పంచ్ లోతుకుంట రేణుక.**

**మోత్కూర్, జూన్ 28,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ మండలం పనకబండ గ్రామంలోపల్స్ పోలియో కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోతుకుంట రేణుక పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతు పోలియో అనే మహమ్మారి నుండి ప్రతీ చిన్నారికి రక్షణ కల్పించడం మన అందరి బాధ్యత అని, ఆరోగ్యవంతమైన పోలియో రహిత సమాజ స్థాపనలో సమిష్టిగా పనిచేయాలని అన్నారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధారపు మల్లేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పల్స్ పోలియో డ్రైవ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

**జహీరాబాద్ వెలుతురు జూన్ 28:**



పల్స్ పోలియో డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో వ్యాధి నుంచి చిన్నారులను రక్షించేందుకు పల్స్ పోలియో చుక్కలు అత్యంత ప్రభావవంతమైన ముందుజాగ్రత్త చర్య అని అన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, మాజీ ఆత్మ చైర్మన్ పెంటా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం, కౌన్సిలర్లు సుజిత విశ్వేశ్వర్, అబ్దుల్లా, జాకీర్, జాహెద్, మహిపాల్, ప్రవీణ్, రాజు, పాండు, దీపక్‌తో పాటు నాయకులు వెంకట్, కళ్ళెం రవీందర్, అక్బర్, శివస్వామి, మనీష్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 23వ డివిజన్ సీతారాంపూర్ లో ప్రధాని నరేంద్ర మోదీ గారి 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని కరీంనగర్ నగరంలోని 23వ డివిజన్ సీతారాంపూర్ లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ ద్వారా దేశ ప్రజల్లో సామాజిక బాధ్యత, సేవా భావం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, యువత భాగస్వామ్యం వంటి అంశాలపై నిరంతరం చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ప్రధాని ఇచ్చే సందేశాలు అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాదం శివరాజ్, 23వ డివిజన్ బూత్ అధ్యక్షులు (BLAలు), బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి మైనార్టీ మోర్చా నేత ముజీబ్ జన్మదిన వేడుకలు: వృద్ధాశ్రమంలో పండ్లు, బిస్కెట్ల పంపిణీ

**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**



బిజెపి రాష్ట్ర మైనారిటీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ముజీబ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రోజున మైనారిటీ నాయకుడు మహమ్మద్ ఆఫ్జాల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కట్టారాంపూర్ లోని వృద్ధాశ్రమంలో పండ్లు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు మహమ్మద్ ఆఫ్జాల్ మాట్లాడుతూ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. బిజెపి మైనారిటీ మోర్చా నేత ముజీబ్ ఇలాగే నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన



**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 31వ డివిజన్ కాన్పూర్ దుర్గమ్మ గడ్డ రోడ్ నెం.11 వద్ద రూ.15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నగరపాలక సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోనే పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, 31వ డివిజన్ కార్పొరేటర్ ముఖద్దర్ హుస్సేన్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో 'మన్ కీ బాత్' కార్యక్రమం వీక్షించిన నాయకులు, చిన్నారులు

**జహీరాబాద్ వెలుతురు జూన్ 28:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, చిన్నారులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదీర్ బండారి, బీజేపీ యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మాజీ నరేష్ పాటిల్ పాల్గొన్నారు. ప్రధాని ప్రసంగాన్ని చిన్నారులు ఆసక్తిగా వీక్షించగా, దేశాభివృద్ధి, సామాజిక బాధ్యత, యువత పాత్ర వంటి అంశాలపై అవగాహన పెంపొందించే సందేశాలు కార్యక్రమంలో వినిపించాయని నాయకులు తెలిపారు.



# తులం బంగారం హామీ ఎక్కడ..? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే మాణిక్ రావు

- **తులం బంగారం, ఇతర సంక్షేమ హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 28:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు పస్తాపూర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం చెక్కులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని తెలిపారు.

ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు పొందిన ప్రతి లబ్ధిదారునికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం కూడా అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తే కాంగ్రెస్ నాయకులు అనవసర రాజకీయాలు చేస్తున్నారని, గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ అసలు సమస్య నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ప్రస్తుతం చెక్కులు పొందుతున్న వారిలో ఎక్కువ మంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే వివాహాలు చేసుకున్నారని పేర్కొన్నారు.ప్రతి మహిళకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ వంటి ఎన్నికల హామీలు కూడా అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మూసీ ప్రక్షాళన పేరుతో భారీ వ్యయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం తన ఎన్నికల హామీలను నిలబెట్టుకుని, కళ్యాణలక్ష్మి –షాదీ ముబారక్ లబ్ధిదారులందరికీ లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందించాలని ఎమ్మెల్యే మాణిక్ రావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం, కౌన్సిలర్లు అబ్దుల్లా, దీపక్, విశ్వేశ్వర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శేఖపూర్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు

- **ఎంపీ నిధులతో రెండు బోర్‌వెల్స్ ప్రారంభం...**
- **గ్రామాభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ ఎం.డి. చేష్మొద్దీన్ స్పష్టం...**
- **సహకరించిన ఎంపీ సురేష్ షేట్కార్, మాజీ చైర్మన్ ఎం.డి. తన్వీర్, నాయకుడు గంకటి శుక్లవర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు....**

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 28:**





గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని శేఖపూర్ గ్రామ సర్పంచ్ ఎం.డి. చేష్మొద్దీన్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని శేఖపూర్ గ్రామంలో స్థానిక ఎంపీ సురేష్ షేట్కార్ నిధులతో మంజూరైన రెండు తాగునీటి బోర్‌వెల్స్ డ్రిల్లింగ్ పనులను ఆదివారం సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చేష్మొద్దీన్ మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గత నెలలో మాజీ ఐడీసీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ సమక్షంలో ఎంపీ సురేష్ షేట్కార్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే రెండు బోర్‌వెల్స్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం పార్లమెంట్ సీనియర్ నాయకుడు గంకటి శుక్లవర్ధన్ రెడ్డి ప్రత్యేక చొరవతో సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా సహకరించారని పేర్కొన్నారు.గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి బోర్‌వెల్స్ మంజూరు చేసిన ఎంపీ సురేష్ షేట్కార్‌కు, సహకరించిన మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్, గంకటి శుక్లవర్ధన్ రెడ్డికి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ న్యామతాబాద్ పద్మమ్మ ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్, ఆత్మ కమిటీ సభ్యుడు నారాయణ్ గౌడ్, వార్డు సభ్యులు మొహమ్మద్ జాహెద్ అలీ, గొట్టటి శేఖర్, అఖిలేష్, మొహమ్మద్ జాహిరుద్దీన్, మరియం సైఫ్, కాంగ్రెస్ నాయకులు ఆరిఫ్ అలీ, మొహమ్మద్ అబ్దుల్ రౌఫ్, షేక్ అలీ, ఖుర్షిద్ అలీ, ఉద్యమకారులు సాదిక్ అలీ, సీనియర్ నాయకులు షకీర్ ఒస్తాద్, ఫైజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' పై కాంగ్రెస్, బీఆర్ఎస్ దుష్ప్రచారాలను నమ్మకండి...

- **మానకొండూర్ నియోజకవర్గ బి ఎల్ ఏ.-1 , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి.**

**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**

సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఓటర్ జాబితా పై దేశావ్యాప్తంగా జరుగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేకమైన సమగ్ర సవరణ) లో భాగంగా మానకొండూర్ నియోజకవర్గం లో ఇంటింటికి జరుగుతున్న సర్వే పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఎస్ఐఆర్ మానకొండూర్ నియోజకవర్గ బీఎల్ఏ 1,బీజేపీ రాష్ట్ర నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీ గ్రామం లో జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా ఓట్లు



ఓటర్ కు ఎన్యూమరేట్ పత్రాన్ని అందిస్తున్న బీఎల్ఏ మరియు బీఎల్వో

తొలగించబడతాయని కొన్నిచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు అంటున్నారని అన్నారు. కేవలం వారి అవగాహనా రాహిత్యం వల్లనే ఇలాంటి ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా గ్రామం లోని ఓటర్ ఇంటికి వెళ్లి ఓటు మ్యాపింగ్ తో పాటుగా జరుగుతున్న ప్రక్రియ ను తెలుసుకున్నారు.ప్రతీ బూత్ ల వారిగా నియమించిన బీఎల్ఏ–2 లు బీఎల్ఓ లకు అందుబాటులో ఉండాలని సూచించారు.చనిపోయిన వారి ఓట్లు మరియు నకిలీ ఓట్ల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పై అలసత్వం వహించినట్లు తెలిస్తే జిల్లా పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని అన్నారు. ఓటు సవరణ చేసుకున్న ఓటర్లకు, సర్వే లో పాల్గొని బీఎల్ఓ లకు సహకరిస్తున్న బీజేపీ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓ గంగు మల్లేశం,మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జి సుగుర్తి జగదీశ్వరాచారి,సీనియర్ నాయకులు వేల్పుల ఓదయ్య, బూత్ అధ్యక్షులు కోతి రాజు, రేగూరి సుగుణాకర్,సోన్నాకుల రాజు,బీఎల్ఏ–2 సిద్ధ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ 53వ డివిజన్‌లో లోతట్టు ప్రాంతాల పరిశీలన

**ముంపు సమస్యల శాశ్వత పరిష్కారానికి రూ.25 కోట్లతో డీపీఆర్**

**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్‌లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ శ్వేత రమన్, మున్సిపల్ అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పర్యటన సందర్భంగా మంచిర్యాల చౌరస్తా నుంచి శర్మనగర్ వరకు ఉన్న లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు ఇళ్లలోకి చేరుతున్న సమస్యను స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిశీలించిన మేయర్ సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు నగరంలోని అన్ని డివిజన్లలో మురుగు కాలువల పూడికతీత (సిల్ట్ తొలగింపు) పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల 51వ డివిజన్‌లో కూడా ఇదే తరహా పనులను పరిశీలించినట్లు పేర్కొన్నారు.రోడ్లపైకి, ఇళ్లలోకి వర్షపు నీరు చేరే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే



లక్ష్యంతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద సుమారు రూ.25 కోట్ల వ్యయంతో డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) సిద్ధం చేసి, త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నగర ప్రజలకు పలు సూచనలు చేశారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్, చెత్త వేయవద్దని, పూడికతీత పనుల సమయంలో మట్టికన్నా ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత కరీంనగర్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఇంటింటి చెత్తను మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ★స్వచ్ఛ ఆటోలకు★ మాత్రమే అందించాలని, ఆటోలు రాని ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దివంగత మాజీ మంత్రి మొహమ్మద్ ఫరీదుద్దీన్ సేవలు చిరస్మరణీయం

- **అజ్మీర్ షరీఫ్ దర్గా సజ్జాదా నషీన్, హజ్రత్ సయ్యద్ నసీరుద్దీన్ చిష్తీ....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 28:**

హైదరాబాద్ నుంచి గుల్బర్గా ప్రయాణిస్తున్న సందర్భంగా అజ్మీర్ షరీఫ్ దర్గా సజ్జాదా నషీన్, అఖిల భారత సూఫీ సజ్జాదానషీన్ కౌన్సిల్ చైర్మన్ హజ్రత్ సయ్యద్ నసీరుద్దీన్ చిష్తీ తన బృందంతో కలిసి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని దివంగత మాజీ మంత్రి మొహమ్మద్ ఫరీదుద్దీన్ నివాసాన్ని మర్యాదపూర్వకంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొహమ్మద్ ఫరీదుద్దీన్ ప్రజల సంక్షేమాన్ని జీవిత ధ్యేయంగా తీసుకుని, కులమతాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన చూపిన సేవా మార్గం, వినయం, మానవతా విలువలు నేటి తరానికి ఆదర్శప్రాయమని ప్రశంసించారు.అనంతరం ఫరీదుద్దీన్ కుమారుడు, తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ శెట్కార్ కలిసి హజ్రత్ సయ్యద్ నసీరుద్దీన్ చిష్తీకి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు,



ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన చాయ్ విందులో పాల్గొని పరస్పరం ఆత్మీయంగా ముచ్చటించారు.

# పోలియో రహిత తెలంగాణ మన లక్ష్యం.

- చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక వేయించాలి.
- రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల మంది పిల్లలకు పోలియో డోస్.
- రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**






పోలియో రహిత సమాజమే మన ముందున్న లక్ష్యం అని రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.ఆదివారం రాష్ట్రస్థాయి పల్స్ పోలియో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు నవీన్ యాదవులతో కలిసి లాంచనంగా ప్రారంభించి 0-5 చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రవ్యాప్తంగా 41లక్షల మంది పిల్లలకు 22వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు 900 ట్రాన్సిట్ పాయింట్ లలో పోలియో చుక్కలు వేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పోలియో కార్యక్రమంలో 52 లక్షలకు పైగా వ్యాక్సిన్ను సిద్ధంగా ఉంచినట్లు మంత్రి పేర్కొన్నారు.రతదేశంలో చివరి పోలియో కేసు 13 జనవరి 2011 న గుర్తించబడిందని, అనంతరం 2012లో భారత్ పోలియో వ్యాధి ప్రబల దేశాల జాబితా నుండి తొలగించపడగా, 2014 మార్చి 27న ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్వో నుండి పోలియో రహిత దేశంగా ధ్రువీకరణ పత్రం పొందిందని మంత్రి తెలిపారు. పోలియో లేదనే భావన మనలో ఉండకూడదని , వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లాలో 5 లక్షల పైగా ఉన్న చిన్నారులకు జిల్లాలో ఏర్పాటు కేంద్రాలలో తల్లిదండ్రులు తప్పక పోలియో చుక్కలు వేయించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు పోలియో వల్ల కలిగే నష్టాలు అలాగే అంగ వైకల్యంపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ఇంటింటి సర్వేలో వైద్య సిబ్బంది మూడు రోజులు పర్యటిస్తారని చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, సంచాలకులు , ప్రజారోగ్య&కుటుంబ సంక్షేమ శాఖ డాక్టర్ రవీంద్ర నాయక్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ , జాయింట్ డైరెక్టర్ చైల్డ్ హెల్త్ డాక్టర్ విజయ నిర్మల , జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ సంధ్య , స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు,రాష్ట్ర, జిల్లా అధికారులు, వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలకు అనంత్ అంబానీ భారీ కానుకలు..

- టీటీడీకి 25 ఎలక్ట్రిక్ బస్సుల విరాళం
- శ్రీవారి సన్నిధిలో సేవలం దించిన అనంత్ అంబానీ
- తితిదేకు 25 ఎలక్ట్రిక్ బస్సులు అందజేస్తామని ప్రకటన
- 50 మంది బస్సు డ్రైవర్ల జీతభత్యాలను రిలయన్స్ భరిస్తుంది
- తిరుమలలో ఆధునిక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్న సంస్థ
- తితిదే గోశాల ఆధునికీకరణకు అంగీకారం తెలిపిన అనంత్
- గుజరాత్ వంతారా తరహాలో గోశాల అభివృద్ధికి ప్రణాళిక
- వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొన్న రిలయన్స్ వారసుడు
- తితిదే అధికారుల ఘన స్వాగతం, ప్రత్యేక దర్శనం
- శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ అధికారులు

**భక్తుల సేవల కోసం ఆధునిక సదుపాయాల కల్పనకు రిలయన్స్ ముందుకు**



**తిరుపతి వెలుతురు జూన్ 28:**

ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ తిరుమల శ్రీవారిని దర్శించుకుని తితిదేకు పలు కీలక విరాళాలను ప్రకటించారు. భక్తులకు మెరుగైన రవాణా సదుపాయాలు, గోశాల అభివృద్ధి కోసం రిలయన్స్ సంస్థ తరఫున పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. తిరుమలలో పర్యావరణ హిత రవాణా వ్యవస్థను బలోపేతం చేసేలా 25 ఎలక్ట్రిక్ బస్సులను తితిదేకు విరాళంగా అందజేస్తామని ప్రకటించారు.ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు అవసరమైన సిబ్బందికి కూడా రిలయన్స్ అండగా నిలవనుంది. ఈ బస్సులను నడిపే 50 మంది డ్రైవర్ల జీతభత్యాలను సంస్థే భరిస్తుందని అనంత్ అంబానీ ప్రకటించారు. అలాగే తిరుమలలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం అత్యాధునిక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో తిరుమలలో పర్యావరణహిత రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.తితిదే గోశాల అభివృద్ధికి కూడా అనంత్ అంబానీ ప్రత్యేక ఆసక్తి చూపించారు. గుజరాత్‌లోని వంతారా ప్రాజెక్టు తరహాలో తిరుమల గోశాలను ఆధునికీకరించేందుకు అంగీకారం తెలిపారు. గోశాలలో పశువుల సంరక్షణ, వైద్య సదుపాయాలు, ఆధునిక నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేసే దిశగా సహకారం అందించనున్నట్లు సమాచారం.ఆదివారం వేకువజామున అనంత్ అంబానీ తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించిన సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తితిదే అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, తితిదే అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అనంత్ అంబానీకి అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం సత్కరించి వీడ్కోలు పలికారు.అనంత్ అంబానీ ప్రకటించిన విరాళాలు తిరుమలలో భక్తులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడంలో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ బస్సులు, ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి రానుంది. అలాగే గోశాల ఆధునికీకరణతో తితిదే నిర్వహిస్తున్న గోసంరక్షణ కార్యక్రమాలకు మరింత బలం చేకూరనుంది.

# కాలువల్లో పేరుకుపోయిన కొద్దీ చెత్త.. తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

- నగరంలోని ముురుగు, వరద కాలువల్లో భారీగా పేరుకు పోయిన వ్యర్థాలు
- పూడికతో పాటు ప్లాస్టిక్, కేబుల్ వైర్లు, పాత ఫర్నిచర్ వెలికితీత
- వర్షపు నీటి ప్రవాహానికి అడ్డు పడుతున్న చెత్తపై ప్రత్యేక దృష్టి
- డీఆర్ఎఫ్, మెట్ బృందాలతో 24 గంటలూ శుభ్రత పనులు
- ఆఘాపురా నాలాలో ఆరు రోజులుగా కొనసాగుతున్న క్లీనింగ్ డ్రైవ్
- ఇప్పటివరకు 13 టిప్పర్ల చెత్త తొలగించినట్లు హైడ్రా వెల్లడి
- మియాపూర్, చందానగర్, లింగంపల్లి ప్రాంతాల్లోనూ విస్తృత చర్యలు
- కృష్ణానగర్‌లో వరద ముప్పు తగ్గించేందుకు బాక్స్ డ్రైన్ల శుభ్రపరిచే పనులు
- జీహెచ్ఎంసీ, ఇతర శాఖల సమన్వయంతో కొనసాగుతున్న ఆపరేషన్
- కాలువల్లో చెత్త వేయొద్దని

**ప్రజలకు హైడ్రా అధికారుల విజ్ఞప్తి**






**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**

హైదరాబాద్ నగరంలో వరదల నివారణకు హైడ్రా అధికారులు మురుగు, వరద కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. నగర వ్యాప్తంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ (మెట్) బృందాలు 24 గంటలూ పనిచేస్తూ కాలువల్లో పేరుకు పోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు, కేబుల్ వైర్లు, పాత పరుపులు, దిండ్లు, సోఫాలు, కుర్చీలు తదితర చెత్తను తొలగిస్తున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. ఈ చెత్త వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కాలనీలు, రహదారులు మునిగిపోతున్నాయని పేర్కొన్నారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), ఇతర మున్సిపల్ సంస్థలు, ఇరిగేషన్, పోలీసు శాఖల సమన్వయంతో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మెహిదీపట్నం, మల్లేపల్లి, విజయనగర్ కాలనీ మీదుగా మూసీలో కలిసే ఆఘాపురా నాలాలో భారీగా చెత్త పేరుకుపోవడంతో ఆరు రోజులుగా ప్రత్యేకంగా శుభ్రత పనులు చేపట్టామని వెల్లడించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో కాలువ ప్రహరీని తొలగించి జేసీబీల సహాయంతో ఇప్పటివరకు 13 టిప్పర్ల చెత్తను బయటకు తీసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.మియాపూర్–పటాన్‌చెరు మార్గంలోని బాక్స్ డ్రైన్‌లో కేబుల్ వైర్లు భారీగా పేరుకుపోవడంతో వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. అలాగే చందానగర్, లింగంపల్లి ఆర్‌యూబీ వద్ద బాక్స్ డ్రైన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించగా రెండు ట్రక్కుల చెత్త బయటకు వచ్చినట్లు వెల్లడించారు.జూబ్లీహిల్స్ నుంచి వచ్చే వరద నీరు కృష్ణానగర్‌ను ముంచెత్తడానికి ప్రధాన కారణం బాక్స్ డ్రైన్‌లో పేరుకుపోయిన పూడికేనని అధికారులు తెలిపారు. స్లాబులు తొలగించి జీహెచ్ఎంసీతో కలిసి భారీ స్థాయిలో పూడికను తొలగించినట్లు చెప్పారు.మురుగు, వరద కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని హైడ్రా అధికారులు విజ్ఞప్తి చేశారు. కాలువలు పరిశుభ్రంగా ఉంటేనే వర్షాకాలంలో నగరంలో నీటి నిల్వలు, వరద సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్-స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..300 మందిపై కేసులు

**సైబరాబాద్ వెలుతురు జూన్ 28:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 300 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.259 ద్విచక్ర వాహనదారులు,06 ఆటోలు,34 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —245 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,– 30 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, – 25 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.



వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (22.06.2026 – 27.06.2026) లో 251 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.00 మందికి జరిమానా, జైలు శిక్ష, 00 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 251 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ, దర్శనానికి రెండు గంటల నిరీక్షణ

- ఆదివారం సెలవు కావడంతో పోటెత్తిన భక్తులు
- శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భారీ క్యూ లైన్లు
- ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల వేచి ఉండాల్సిన పరిస్థితి
- ప్రత్యేక దర్శనానికి గంట సమయం పడుతోందని ఆలయ వర్గాలు
- ఆర్జిత సేవలు, నిత్యపూజల్లో భక్తుల అధిక భాగస్వామ్యం
- నిత్య కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు
- లడ్డూ ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా రద్దీ
- సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో ప్రత్యేక పూజలు

**పుష్కరిణి, కల్యాణకట్ట, పార్కింగ్ ప్రాంతాల్లో సందడి**

**భక్తుల రాకతో యాదాద్రి క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ**

**యాదగిరిగుట్ట వెలుతురు జూన్ 28:**

యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ భారీగా కనిపించింది. సెలవు రోజు కావడంతో తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం ఆలయానికి చేరుకున్న భక్తులతో క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంలో కళకళలాడింది.భక్తుల రద్దీ కారణంగా ఆలయంలోని క్యూ లైన్లు పూర్తిగా నిండిపోయాయి.

ఉచిత ప్రవేశ దర్శనం కోసం వచ్చిన భక్తులు దాదాపు రెండు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సుమారు గంట సమయం పడుతోందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.స్వామివారి ఆర్జిత సేవలు, నిత్యపూజల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నిత్య కల్యాణ సేవలో పాల్గొనేందుకు కూడా భక్తులు ఆసక్తి చూపించారు.ఆలయంలోని లడ్డూ ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద ఉన్న కల్యాణకట్ట, పుష్కరిణి ప్రాంతాల్లో రోజంతా భక్తుల రద్దీ కొనసాగింది. వాహనాల పార్కింగ్ ప్రాంతాలు కూడా వాహనాలతో నిండిపోయాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూ లైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు లడ్డూ ప్రసాదం స్వీకరించి, ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుగు ప్రయాణమయ్యారు.



# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికా-ఇరాన్ మధ్య తాజా దాడులతో యుద్ధ మేఘాలు
- పరస్పర దాడులతో ఉద్రిక్తంగా మారిన పశ్చిమాసియా పరిస్థితులు
- ఇరాన్ క్షిపణి, డ్రోన్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు
- కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు
- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఒకరిపై ఒకరు ఉల్లంఘించారంటూ ఆరోపణలు
- కార్గో నౌకపై దాడే అమెరికా చర్యలకు కారణమన్న వాషింగ్టన్
- లెబనాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు కూడా కొనసాగుతుండటంతో ఆందోళన
- ప్రాంతంలో మరోసారి పూర్తిస్థాయి యుద్ధం తప్పదా? అనే ప్రశ్నలు

**పశ్చిమాసియా వెలుతురు జూన్ 28:**

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ అవగాహన కొనసాగుతుందనుకున్న సమయంలో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి సైనిక దాడులు చోటుచేసుకోవడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. రెండు దేశాలు ఒకదానిపై ఒకటి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని ఆరోపిం



చుకుంటూ పరస్పర దాడులకు దిగాయి. దీంతో ప్రాంతంలో శాంతి చర్చల భవితవ్యంపై అనిశ్చితి నెలకొంది. అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌లోని క్షిపణి నిల్వ కేంద్రాలు, డ్రోన్ స్థావరాలు, తీర ప్రాంత రాడార్, కమ్యూనికేషన్ వ్యవస్థలపై వైమానిక దాడులు నిర్వహించింది. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌకపై ఇరాన్‌కు అనుకూల బలగాలు డ్రోన్ దాడి చేశాయని, అదే కాల్పుల విరమణ ఒప్పందానికి విరుద్ధమని అమెరికా పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ప్రతిస్పందన చర్యగా ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు వాషింగ్టన్ వెల్లడించింది.అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు ప్రారంభించినట్లు ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ ప్రధాన కేంద్రం, కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ దాడుల అనంతరం రెండు దేశాల్లోనూ అప్రమత్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా చేస్తున్న ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. కార్గో నౌక ఘటనను సాకుగా చూపి పశ్చిమాసియాలో పరిస్థితులను మరింత దిగజార్చేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఐఆర్‌జీసీ ఆరోపించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని వాస్తవానికి అమెరికానే ఉల్లంఘిస్తోందని, ఇదే కొనసాగితే శాశ్వత శాంతి కోసం సాగుతున్న దౌత్య చర్చలు పూర్తిగా నిలిచిపోతాయని హెచ్చరించింది. ఎలాంటి దాడికైనా మరింత తీవ్రంగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తాజా పరిణామాలపై ఘాటుగా స్పందించారు. ఇరాన్ మరోసారి ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో అమెరికా వైమానిక దళం దాడులు నిర్వహించిందని తెలిపారు. "వారు పాఠం నేర్చుకోకపోతే ఇప్పటికే ప్రారంభించిన పనిని సైనిక చర్యల ద్వారా పూర్తి చేయాల్సి రావచ్చు. అలాంటి పరిస్థితి వస్తే ఇరాన్ ఉనికే ప్రమాదంలో పడుతుంది" అంటూ ట్రూత్ సోషల్ వేదికగా హెచ్చరించారు.ఇటీవల అమెరికా–ఇరాన్ మధ్య 60 రోజుల్లో శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు అవగాహన ఏర్పడింది. హర్మూజ్ జలసంధిలో నౌకల సురక్షిత రాకపోకలు, ఇరాన్ అణు కార్యక్రమం, శుద్ధి చేసిన యురేనియం నిల్వలు వంటి కీలక అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. అయితే తాజా దాడులు ఈ చర్చలకు గట్టి ఎదురుదెబ్బగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా అమెరికా మధ్యవర్తిత్వంతో లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య కుదిరిన అవగాహన కూడా పరీక్షకు గురవుతోంది. హెజ్‌బొల్లాపై అవసరమైతే చర్యలు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ సంకేతాలు ఇవ్వడంతో దక్షిణ లెబనాన్‌లో కూడా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలన్నీ కలిసి పశ్చిమాసియాలో మరోసారి పూర్తిస్థాయి ఘర్షణలు చెలరేగే ప్రమాదం ఉందనే ఆందోళనను అంతర్జాతీయ వర్గాల్లో పెంచుతున్నాయి.

# రంగారెడ్డి జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 28:**





దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లాలో ఘనంగా ప్రారంభించి విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో మొత్తం 1680పల్స్ పోలియో కేంద్రాల ద్వారా 0 నుండి 5 సంవత్సరాల లోపు సుమారు 4,21,000 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 8,210 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు.గచ్చిబౌలి జెడ్పీహెచ్‌ఎస్‌లో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, వైద్య ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ డాక్టర్ క్రిస్టినా జోంగ్తు, ఐఏఎస్ జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు.సరోర్‌నగర్ నందనవనం బస్తీ దవాఖానలో అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పల్స్ పోలియో బూత్‌ను ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా సమీప పోలియో కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పోలియో చుక్కలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు బస్తీలు, వలస కార్మికుల కాలనీలు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు సేవలందిస్తున్నాయని చెప్పారు. ఎవరూ మిగిలిపోకుండా ఇంటింటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీం భరత్, మాజీ జెడ్పీటీసీ కాలే శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, షాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి తెలిపారు. ఇప్పటివరకు లక్ష్యంగా నిర్దేశించిన 0–5 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల్లో సుమారు 98 శాతం మందికి పోలియో చుక్కలు వేయడం పూర్తయిందన్నారు. మిగిలిన అర్హులైన చిన్నారులకు ప్రత్యేక హౌస్–టు–హౌస్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఒక్క చిన్నారి కూడా పోలియో టీకాకు దూరం కాకుండా అన్ని చర్యలు చేపట్టామని, తల్లిదండ్రులు ఆరోగ్య సిబ్బందికి పూర్తిగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# పేదల ఇళ్లను కూల్చితే ప్రభుత్వాన్నే కూల్చేస్తారు: మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్

- బోయిన్‌పల్లి అస్మత్‌పేటలో హైడ్రా కూల్చివేతలకు నిరసనగా ధర్నా
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఈటల హామీ
- భూమి యాజమాన్యంపై ముందుగా రెవెన్యూ శాఖ స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- అక్రమ లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచన
- హైడ్రా భూకబ్జాదారులపై కాకుండా పేదలపై ప్రతాపం చూపుతోందని ఆరోపణ
- శాశ్వత హక్కు పత్రాలు ఇచ్చి పేదలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి
- పేదలకు అన్యాయం చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**

బోయిన్‌పల్లి డివిజన్‌లోని అస్మత్‌పేటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలకు నిరసనగా తాను ధర్నా నిర్వహించినట్లు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. బాధిత కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నానని, వారికి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.అస్మత్‌పేట గ్రామంలోని సర్వే నంబర్–1 భూమిపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ముందుగా అది ప్రభుత్వ భూమా, ప్రైవేట్ భూమా, లేక పురావస్తు శాఖకు



చెందినదా అనే అంశాన్ని రెవెన్యూ శాఖ స్పష్టంగా తేల్చాలని ఈటల డిమాండ్ చేశారు. భూమి యాజమాన్యంపై స్పష్టత లేకుండానే ఇళ్లను కూల్చివేయడం సరైన విధానం కాదన్నారు.హైడ్రా ఏర్పాటైనప్పుడు చెరువులు, మురుగు కాలువలు, వరద కాలువలను పరిరక్షిస్తుందని, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడుతుందని ప్రజలు భావించారని అన్నారు. అయితే తక్కువ కాలంలోనే హైడ్రా తన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని ఆరోపించారు. పేదలు కన్నీళ్లు పెడుతున్నా, వేడుకుంటున్నా కనికరం లేకుండా వారి ఇళ్లను కూల్చివేస్తోందని విమర్శించారు.ప్రభుత్వ భూమి అయితే దానిని లేఅవుట్ చేసిన వారు ఎవరు, విక్రయించిన బ్రోకర్లు ఎవరు, వారికి సహకరించిన అధికారులు, రాజకీయ నాయకులు ఎవరో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈటల డిమాండ్ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు.భూకబ్జాదారులు, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా పేదలపై మాత్రమే ప్రతాపం చూపుతున్నారని హైడ్రాపై ఆయన విమర్శలు గుప్పించారు. కోర్టులు పనిచేయని శనివారాలు, సెలవు రోజుల్లో సాయంత్రం వేళ కూల్చివేతలు చేపట్టడం ద్వారా బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశాన్ని కూడా దూరం చేస్తున్నారని ఆరోపించారు.ఇక్కడ నివసిస్తున్న వారి కులం పేదరికం, వారి మతం కష్టపడి పనిచేసి కుటుంబాలను పోషించుకోవడమేనని ఈటల అన్నారు. ఎన్నో ఏళ్ల కష్టార్జితంతో చిన్న స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదలపై ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి నిజంగా మానవత్వం ఉంటే భూములను అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, పేదలను బలిపశువులుగా మార్చవద్దని సూచించారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో చాలామంది ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు.గతంలో తీసుకొచ్చిన జీవో నంబర్ 58, 59 ప్రకారం అనేక నిర్మాణాలను క్రమబద్ధీకరించారని, అప్పటి అధికారులు ఏమి చేశారో ఇప్పుడు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిజమైన పేదలను గుర్తించి విచారణ నిర్వహించి శాశ్వత హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు.అక్రమాలకు పాల్పడిన బ్రోకర్ల నుంచి డబ్బులు వసూలు చేసి, భూకబ్జాదారులను తొలగించి అదే భూమిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈటల సూచించారు. పేదల ఇళ్లను కూల్చడం కొనసాగిస్తే ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బస్తీల్లో నివసించే పేదలంతా అస్మత్‌పేట బాధితులకు అండగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పల్స్ పోలియో కార్యక్రమానికి శ్రీకారం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**



జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పల్స్ పోలియో కేంద్రంలో జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గారు 0–5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా అన్ని ట్రాన్సిట్ కేంద్రాల్లో పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. పి. శ్రీధర్ గారు, ఎస్‌పిహెచ్‌ఓ డా. సాయిబాబా గారు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మంచాల మండలం వివిధ గ్రామాల్లో పాల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించి చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసిన గ్రామ సర్పంచ్ లు

### ఆరుట్ల గ్రామంలో పాల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్, ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్

**మంచాల వెలుతురు జూన్ 28:**

మంచాల మండలం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆరుట్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ మా నిపాటి శోభకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్క లు వేసి ప్రారంభించారు అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ప్రజా సంఘా ల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు ఈసందర్భంగా కాం గ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సమాజం నుంచి పోలియో మ హమ్మారిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని అన్నారు ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియోచుక్కలు వేయించి వారి ఆరోగ్యమైన భ విష్యత్తుకు తల్లిదండ్రులు భరోసా కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వా ర్డు సభ్యులు పున్నం రాము మహమ్మద్ ఇమ్రాన్ మాదుగుల బాలమని కృష్ణగౌడ్ లాలగారిమణె మ్మ ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ తెలంగాణ ఉద్యమకారుడు ఆనంగల్ల పర మేష్ చీమర్ల క్రాంతి కుమార్ కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామకార్యదర్శి చిందం శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ నా యకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ పాండాల యాదయ్యగౌడ్ మహమ్మద్ అష్రఫ్ మంకు ప్ర వీణ్ బత్తుల రాజు గౌడ్ అంగన్వాడీ టీచర్లు రామేశ్వరి విజయలక్ష్మి జంగమ్మ ఆశావర్కర్లు అలివే లు తదితరులు పాల్గొన్నారు



ఆరుట్ల గ్రామంలో చిన్నపిల్లలకు హోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

(మంచాలలో )

### మంచాల గ్రామంలో పాల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న గ్రామసర్పంచ్ ఏర్పుల మానసవినయ్

మంచాల మండల కేంద్రలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రామసర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఈ సందర్భంగా సర్పంచ్ మానస వినయ్ మాటాడుతూ గ్రామంలో ఉన్నప్రతి ఒక్క 5 సంవత్సరాలలోపు చిన్నారు లు పోలియోచుక్కలు వేయించుకోవాలని పోలియో తరిమికొట్టి పిల్లల భవిష్యత్తుని కాపాడు కోవా లని అన్నారు ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు గ్యార జంగయ్య పడుతల సాయిలు నీళ్ల పారిజా త కృష్ణ గడ్డం పారిజాత బాబయ్యా నాయకులు గ్యార జగన్ ఏరుకొండ రాములు రావుల శ్రీనివాస్ గడ్డం కిరణ్ రావుల ఆనంద్ మరియు ఆశావర్కర్లు అంగన్వాడి టీచర్లు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు (కాగజ్ ఘట్ గ్రామంలో)



ఆరుట్ల గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్


### పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న గ్రామసర్పంచ్ బాకారం శిల్పనరసింహారెడ్డి

మంచాల మండలం కాగజ్ ఘాట్ గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేసిన గ్రామసర్పంచ్ బాకారం శిల్పానర్సింహారెడ్డి రెండుచుక్కలు జీవితాంతం రక్షణ ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసంపల్స్ పోలియో చుక్కలు కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కందుకూరి జంగయ్య సయ్యద్ రిజ్వాన్ ఆశవర్కర్ పంది ఐలమ్మ అంగన్వాడీ టీచర్ విజయ ప్రభుత్వ నర్స్ గ్రామ పెద్దలు వంగల ఇబ్రామ్ తదితరులు పాల్గొన్నారు.



మంచాల మండల కేంద్రంలో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్





# బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష
- టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశం

**బాసర, వెలుతురు జూన్ 28:**



పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఇటీవల చోరీ జరిగిన మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మంత్రి సందర్శించి ఘటనపై ఆరా తీశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అంతకుముందు ఇంద్రప్రస్థ గెస్ట్ హౌస్‌లో బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు, టెండర్ల ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి, ఆలయ ఈవో అంజనాదేవితో మంత్రి సమీక్ష నిర్వహించారు. దర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం.. చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఉప్పల విద్య కల్పన ఏకాంత్ గౌడ్"

**కూకట్ పల్లి, జూన్ 28:**

కూకట్ పల్లి వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్ బస్తి దవాఖానలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, వివేకానంద నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉప్పల విద్య కల్పన ఏకాంత్ గౌడ్ పాల్గొని ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలియో నిర్మూలనలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతాయుతంగా వ్యవహరించి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. రెండు చుక్కల పోలియో మందు చిన్నారులను జీవితాంతం పోలియో మహమ్మారి నుంచి రక్షిస్తుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజారోగ్య కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్న ఆమె, ప్రభుత్వం నిర్వహిస్తున్న



ఉచిత ఆరోగ్య కార్యక్రమాలను బస్తీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజలు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంపంగి యాదగిరి, డివిజన్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు అంబిక, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, బస్తీ నివాసులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎస్.ఎస్.కె సమాజ్ సభ్యులందరికీ నా అభినందనలు: ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 28:**




జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట కొండపై గల సహస్రార్జున దేవాలయం వద్ద ఎస్.ఎస్.కె.సమాజ్, కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన " నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ" కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తూ ఎస్ఎస్కే సమాజ్ సంఘం సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంతకుముందు సహస్రార్జున దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షులు హనుమంతరావు, సహస్రార్జున టెంపుల్ ఫౌండర్ గోల్కొండ ఓం ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ రఘు, సభ్యులు దశరథ్, రాజ్ కుమార్, శివ, నాగేందర్, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోమ్మాయిగూడెం గ్రామంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం

- పాల్గొన్న సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 28:**



గ్రామం కోమ్మాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 0–5 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకోసం ఈరోజు నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం లో సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి. పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.తల్లి తండ్రులు మీ 0–5సంవత్సరాల లోపు వయసున్న పిల్లలందరికి పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజం నిర్మించాలన్నారు .ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ తిరుపాల ఐలయ్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు ఆశ వర్కర్ లు తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్లకు కలుసుకున్నారు






**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 28 :**

సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ పట్టణ జూనియర్ కళాశాలలో 1999– 2001 బ్యాచ్ లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఫ్రెండ్స్ ఆదివారం మనూర్ మండలంలోని బోరన్ ఆలయంలో గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకుని కలుసుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకొని ప్రస్తుతం వాళ్లు ఏమేమి చేస్తున్నారని చెప్పుకుంటూ రోజంతా ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. అప్పుడు వాళ్లకు విద్యాబుద్ధులు చెప్పిన టీచర్లను గుర్తు చేసుకున్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని సద్వినియోగం చేసుకోవాలి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 28:**

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద లబ్ధిదారులకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను ఆదివారం చింతల్ లోని కుత్బుల్లాపూర్

నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్ధిదారులకు అందజేశారు.

**ఎల్వోసీ మంజూరు లబ్దిదారులు :-**

125 – గాజులరామారం డివిజన్ శ్రీరామ్ నగర్ కు చెందిన మరియాల తులసి బాయ్ భర్త ఎం. శ్రీనివాస్ (రూ.2.00 లక్షలు) మంజూరు కాగా....

128 – చింతల్ డివిజన్ చంద్రగిరి నగర్ కు చెందిన ఆది ఆంధ్ర చిన్న గిడ్డన్న తండ్రి చిన్న ఎర్రన్న (రూ.1.10 లక్షలు), రుడామేస్త్రి నగర్ కు చెందిన ఆదిబ్ ఉన్నిసా బేగం భర్త సయ్యద్ అహ్మద్ (3.25 లక్షలు)లకు మంజూరు.

130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన అయ్యిల్ల తనిష్క్ గౌడ్, తండ్రి మహేష్ గౌడ్ (రూ. 60,000/–), కూకుట్ల చిన్నమ్మ భర్త కె శివయ్య (రూ.2 లక్షలు) మంజూరైయ్యాయి.

ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, రషీదా మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు కస్తూరి బాలరాజ్, కర్నెకంటి మల్లేష్, మక్సూద్ అలీ, బస్వరాజ్, కేపీ.వెంకటేష్, ఎండి.యూసుఫ్, బలరాం రెడ్డి, మెహ్రూన్నిసా బేగం, శేఖర్ రావు, ఆకుల ప్రభాకర్ గుప్తా, సామ్రాట్, దాసరి లక్ష్మణ్, వెంకట్ రెడ్డి, విజయ్, ప్రకాష్, ప్రభాకర్ లు ఎల్వోసీ పత్రాలను అందజేశారు.

# బాలాజీ లేఔట్ కాలనీ లో పర్యటించిన మాజీ శాసన సభ్యులు కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 28:**



గాజులరామారం సర్కిల్ బాలాజీ లేఔట్ లోని కాలనీల వాసులు ఎదుర్కొంటున్న అంతర్గత సిసి రోడ్లు డ్రైనేజీ మరియు మంచినీటి సమస్యలను కాలనీలలో తిరుగుతూ అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...తమ యొక్క సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి మరియు ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలను వీలైనంత తొందరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం ఓక్షిత కాలనీ అసోసియేషన్ సభ్యులు తాము ఎదుర్కొంటున్న వివిధ మౌలిక సమస్యల గురించి ఆయనకి వినతి పత్రాన్ని అందజేశారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి, కాలనీవాసులు అంజన్న, శ్రీనివాస్, వెంకట అప్పన్న, వెంకటరెడ్డి, శేఖర్, కృష్ణ, వెంకట్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సురప రాజు, అనిల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యానికి పోలియో చుక్కలు తప్పనిసరి

**36వ వార్డు కౌన్సిలర్అప్పం శ్రావణ్ కుమార్....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 28:**



చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి ప్రతి పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ సూచించారు. ఆదివారం వార్డులోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడిన ఆయన, గతంలో పోలియో వ్యాధి కారణంగా అనేక మంది చిన్నారులు శాశ్వత వైకల్యానికి గురయ్యారని గుర్తు చేశారు. నిరంతర టీకా కార్యక్రమాల ఫలితంగా దేశం పోలియో నిర్మూలనలో గణనీయమైన విజయాన్ని సాధించిందన్నారు. ప్రతి చిన్నారికి నిర్ణీత సమయంలో పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు.పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చల్లమల్ల కృష్ణారెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

- జూలై 3న బోయపల్లి సూర్య–బోడిగ శ్రావణి వివాహం
- పలివెల వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న వేడుక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**



మునుగోడు మండలానికి చెందిన బోయపల్లి శ్రీను తన కుమారుడు బోయపల్లి సూర్య, బోడిగ శ్రావణి వివాహ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లమల్ల కృష్ణారెడ్డికి ఆదివారం హైదరాబాద్‌లో అందజేశారు. బోయపల్లి సూర్య–బోడిగ శ్రావణి వివాహం జూలై 3న పలివెల శ్రీ వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సూరిగి నరసింహ గౌడ్, మిద్దె యాదయ్య గౌడ్, సూరిగి వెంకటరమణ, మండల నాయకుడు గోలి లింగస్వామి, భవనం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ నాయకుడు రావుల నాగరాజు తండ్రి రావుల నరసింహ గుండెపోటుతో మృతి

- నరసింహ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**మంచాల వెలుతురు జూన్ 28:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు రావుల నాగరాజు తండ్రి రా వుల నరసింహ గుండెపోటుతో మృతిచెందాడు మరణ వార్త తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఆరుట్ల గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో రావుల నరసింహ నివా సానికి చేరుకొని నరసింహ పై పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొం గర విష్ణువర్ధన్ రెడ్డి అనంతరం నరసింహ కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చి ప్రాగాఢ సానుభూతి తెలిపారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆరుట్ల కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ దా సరమోని రమేష్ ముదిరాజ్ తలారి కృష్ణ ముదిరాజ్ ఆర్ల శ్రీకాంత్ బత్తుల రాజుగౌడ్ మహమ్మద్ అశ్రు రైనా ముదిరాజ్ గొరిగే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 28:**

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు ,డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్ గారు, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధ గారు , జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్, వైద్య అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లి బస్తీ దవాఖానలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, ఏఎన్ఎం స్వర్ణలత, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# మోత్కూర్‌లో రాజ్యాధికార సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

**మోత్కూర్, జూన్ 28,వెలుతురు న్యూస్ :**

జూలై 5న జిల్లా కేంద్రం భువనగిరిలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, మోత్కూర్‌లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ ఆధ్వర్యంలో సమరభేరి సభ పోస్టర్‌ను ఘనంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, బడుగు–బలహీన వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదేల్ యాదవ్, మహిళ అధ్యక్షురాలు పటేల్ వనజక్క, కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, బత్తిని మీనా, చింతకింది ఉషారాణి, పసల రోజారాణి, మోత్కూరు అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, దప్పు యాదగిరి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, స్థానిక నాయకులు మేడబోయిన యాదగిరి, గొలుసుల శ్రీను, రఘువర్ధన్, ఎలిమినేటి బుచ్చయ్య, నామాల నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పోలియో చుక్క... ప్రతీ బిడ్డకు రక్ష:ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 28:**

పల్స్ పోలియో కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా 129 – సూరారం కాలనీ డివిజన్ శివాలయనగర్ లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. నిండైన జీవితానికి రెండు చుక్కలు విధిగా వేయించడం మన



బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జనరల్ సెక్రటరీ సిద్దిక్, సీనియర్ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, స్థానిక బస్తీ వాసులు శివ, వెంకటేష్, మహేశ్వర్ రెడ్డి, ఎల్లారెడ్డి, డేవిడ్, హేమలతరెడ్డి, సరితలు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

**నడింపల్లి నరేష్ యాదవ్**

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 28:**

పోలియో రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా ఆదివారం రోజు గ్రామపంచాయితీ లో నిర్వహించిన పోలియో దినోత్సవ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యులు నడింపల్లి నరేష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. "ప్రతి బిడ్డ ఆరోగ్యమే మన అందరి బాధ్యత. రెండు చుక్కలు జీవితాంతం రక్షణ కల్పిస్తాయి. పోలియో నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి" అని పిలుపునిచ్చారు.పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కలిసి పనిచేసి, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా కృషి చేయాలని ఆయన కోరారు.



# ఆ తిరస్కారంతోనే 'కల్కి'లో బుజ్జి పాత్ర: కీర్తి సురేశ్

ప్రపంచ సినీప్రియుల్ని అలరించిన చిత్రం 'కల్కి 2898ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం విడుదలై నేటితో రెండేళ్లు పూర్తయింది. ఇందులో తన గొంతుతో బుజ్జి పాత్రకు ప్రాణం పోసి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది నాయిక కీర్తి సురేశ్. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. "నాగ్‌అశ్విన్ ఈ సినిమాలో బుజ్జి కాకుండా మరో పాత్రను చేయమని ఆఫర్ చేశారు. కానీ దాని పట్ల నాకెందుకో అంత నమ్మకం కలగలేదు. కానీ ఆ తర్వాత రోజు ఆయన నన్ను మరో అద్భుతమైన పాత్ర ఉంది.. కనీసం అదైనా చేస్తావా? అని అడిగారు. తన సినిమాలో కచ్చితంగా ఏదో ఒక విధంగా భాగమవుతానని నాకు తెలుసు. నిజానికి.. మొదటి పాత్రను తిరస్కరించినందుకు సంతోషంగా ఉంది. దానివల్లే బుజ్జి పాత్రను చేయగలిగాను. దీనికి కేవలం నా స్వరం మాత్రమే అందిస్తే చాలని చెప్పారు నాగ్ అశ్విన్. అప్పుడు నాకు సరిగ్గా అర్థం కాలేదు. అందుకే షూటింగ్‌లో నేను పాల్గొనాల్సిన అవసరం లేదా? అని అడిగాను. "అవసరం లేదు..నాకు కేవలం మీ గొంతు మాత్రమే కావాలి" అని చెప్పారు. ఇదేదో కొత్తగా ఉందని వెంటనే ఓకే అన్నాన"ని చెప్పుకొచ్చింది కీర్తి.

# ఆదర్శ కుటుంబం అక్టోబరులో



'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాలతో వరుస విజయాలందుకొని మంచి జోష్‌లో ఉన్నారు అగ్రహీరో వెంకటేశ్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం:47' (ఏకే47). త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. తమన్ ఈ సినిమాకి సంగీతమందిస్తున్నారు.

# సల్మాన్ ఖాన్ గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌ను వదిలేస్తున్నారా?



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ముంబయిలోని బాంద్రాలో కొత్తగా ఇంటిని నిర్మించుకునేందుకు అనుమతి పొందారు. దీంతో ఖాన్ కుటుంబం త్వరలో దానిలోకి మారనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే 1974 నుంచి ఆయన నివాసం ఉంటున్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌ను ఖాళీ చేస్తారా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. బాంద్రాలోని చింబాయ్ ప్రాంతంలో ఈ కొత్త భవన నిర్మాణానికి పర్యావరణ అధికారులు జూన్ 16న అనుమతులు జారీ చేశారు. ఈ స్థలం సల్మాన్ తల్లి సల్మా ఖాన్ పేరు మీద ఉంది. ఇక్కడ శిథిలావస్థకు చేరిన పాత ఇంటిని కూల్చేసి.. ఆరు అంతస్తుల భవనం నిర్మించనున్నారు. నిర్మాణ సమయంలో చెట్లను నరకకూడదని అధికారులు షరతులు విధించారు.

సల్మాన్‌కు గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌తో విడదీయరాని అనుబంధం ఉంది. పండుగలకు, పుట్టినరోజుకు అక్కడి నుంచే ఆయన అభిమానులకు అభివాదం చేస్తుంటారు. అయితే, గతంలో ఆ అపార్ట్‌మెంట్‌పై లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు జరిపిన విషయం తెలిసిందే.

ఈ వరుస బెదిరింపుల నేపథ్యంలోనే సల్మాన్‌కు పోలీసులు భారీ భద్రతను కల్పించారు. ప్రస్తుతం ఆయన ఉండే అపార్ట్‌మెంట్ కంటే కొద్ది దూరంగానే ఈ కొత్త ఇల్లు నిర్మించనున్నారు. హీరోకు భద్రతాపరంగా అక్కడ మరింత సురక్షితంగా ఉంటుందని భావిస్తున్నారు. సల్మాన్ కుటుంబం కూడా అక్కడికి మారే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# ముగిసిన బజ్‌బాల్ శకం

## అంతర్జాతీయ క్రికెట్‌కు బెన్ స్టోక్స్ గుడ్‌బై!

ఇంగ్లాండ్ టెస్ట్ జట్టు కెప్టెన్, స్టార్ ఆల్రౌండర్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. న్యూజిలాండ్‌తో ప్రస్తుతం ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ తన కెరీర్‌లో ఇంగ్లాండ్ తరఫున ఆఖరి మ్యాచ్ అని స్పష్టం చేశాడు. ఈ మేరకు ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఇంగ్లాండ్ పురుషుల టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతల నుండి కూడా తప్పుకుంటున్నట్లు ధృవీకరించింది. దీనితో ఆయన 15 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ క్రికెట్ ప్రస్థానానికి తెరపడనుంది.



ఈ సందర్భంగా ఈసీబీ చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ మాట్లాడుతూ.. ఇంగ్లాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప ఆటగాళ్లలో బెన్ స్టోక్స్ ఒకరని కొనియాడారు. ఒత్తిడి సమయాల్లో అద్భుత ప్రదర్శన చేయడం, జట్టును ముందుండి నడిపించడం ఆయన ప్రత్యేకత అని గుర్తుచేశారు. "మనం ఒక గొప్ప బ్యాటర్‌ను, బౌలర్‌ను, కెప్టెన్‌ను కోల్పోతున్నాం. ఇంగ్లాండ్ క్రికెట్‌కు ఆయన అందించిన సేవలకు ధన్యవాదాలు" అని థాంప్సన్ పేర్కొన్నారు. 2019 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో అజేయమైన 84 పరుగులతో ఇంగ్లాండ్‌కు తొలి ప్రపంచకప్ అందించడంలో, 2022 టీ20 ప్రపంచకప్ గెలవడంలో స్టోక్స్ కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2019 యాషెస్ సిరీస్‌లో హెడింగ్లీ వేదికగా ఆయన ఆడిన చారిత్రాత్మక ఇన్నింగ్స్ టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది.

జో రూట్ తప్పుకున్న తర్వాత ఏప్రిల్ 2022లో ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన బెన్ స్టోక్స్.. కోచ్ బ్రెండన్ మెకల్లమ్‌తో కలిసి టెస్ట్ క్రికెట్‌లో 'బజ్‌బాల్' అనే సరికొత్త దూకుడు వ్యూహాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇంగ్లాండ్ జట్టు టెస్ట్ క్రికెట్‌లో సంచలన విజయాలు సాధించి, అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇటీవల టెస్ట్ క్రికెట్‌లో 7,000 పరుగులు, 250 వికెట్లు పూర్తి చేసుకున్న ప్రపంచపు రెండో క్రికెటర్‌గా స్టోక్స్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. తాజా నిర్ణయంతో ఒక అద్భుతమైన క్రికెట్ శకం ముగిసినట్లయింది.




# వరల్డ్ కప్ నుంచి భారత్ అవుట్

## ఆస్ట్రేలియా చేతిలో ఘోర పరాజయం

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ప్రయాణం ముగిసింది. లార్డ్స్ మైదానం వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన చావోరేవో తేల్చుకోవాల్సిన కీలక లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. సెమీఫైనల్ చేరాలంటే ఖచ్చితంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో పరాజయం పాలవ్వడం, మరోవైపు గ్రూప్‌లో దక్షిణాఫ్రికా మెరుగైన స్థానంలో ఉండటంతో హర్మన్‌ప్రీత్ సేన టోర్నీ నుండి నిష్క్రమించాల్సి వచ్చింది. భారత్ నిర్దేశించిన 171 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా జట్టు ఇంకా ఒక ఓవర్ మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి సులువుగా ఛేదించింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కేవలం 27 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 56 పరుగులు చేసి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. ఓపెనర్లు స్మృతి మంధాన (38), షఫాలీ వర్మ (34)లు మొదటి వికెట్‌కు 66 పరుగులు జోడించి పటిష్టమైన పునాది వేయగా, జెమీమా రోడ్రిగ్స్ (34 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్) కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. అయితే, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించిన వేళ ఆస్ట్రేలియాను కట్టడి చేయడానికి ఈ స్కోరు సరిపోలేదు.

171 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా మహిళల జట్టు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ఆడింది. ఆసీస్ బ్యాటర్లలో ఎల్లీస్ పెర్రీ (56), యాష్లే గార్డనర్ (53) అర్ధ సెంచరీలతో చెలరేగి భారత బౌలింగ్‌ను ముక్కలు చేశారు. భారత బౌలర్లలో శ్రీ చరణి రెండు వికెట్లు పడగొట్టగా, రేణుకా సింగ్, దీప్తి శర్మ తలో వికెట్ తీసుకున్నారు. ఈ




మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ వికెట్ తీయడం ద్వారా దీప్తి శర్మ అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక వికెట్లు (356 వికెట్లు) తీసిన బౌలర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించినప్పటికీ, జట్టు ఓటమితో ఆ రికార్డు ఆనందం ఆవిరైపోయింది. ఆల్రౌండ్ ప్రదర్శన చేసిన ఎల్లీస్ పెర్రీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

# ఆఖరి బంతి వరకు ఉత్కంఠ

- ఒక్క పరుగు తేడాతో భారత్ పై ఐర్లాండ్ చారిత్రాత్మక విజయం!
- టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్

ఐర్లాండ్ పర్యటనలో భారత యువ క్రికెట్ జట్టుకు తీవ్ర నిరాశ ఎదురైంది. బెల్ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆఖరి బంతి వరకు సాగిన ఉత్కంఠ పోరులో భారత జట్టు కేవలం ఒక్క పరుగు తేడాతో దురదృష్టవశాత్తూ ఓటమి చవిచూసింది. ఈ విజయంతో ఐర్లాండ్ రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుని సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఐర్లాండ్ విధించిన 155 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 153 పరుగులు మాత్రమే చేయగలిగింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ మొదట ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. ఐర్లాండ్ బ్యాటర్లలో హ్యారీ టెక్టర్ (53) అర్ధసెంచరీతో రాణించగా, జార్జ్ డాక్రెల్ (19) కీలక పరుగులు సాధించాడు. భారత బౌలర్లలో అరంగేట్రం చేసిన ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు (3/22) పడగొట్టాడు. శివమ్ దూబే (2/25), అర్షదీప్ సింగ్ (2/35) చెరో రెండు వికెట్లు తీశారు. హర్షిత్ రాణాకు ఒక వికెట్ దక్కింది.

155 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలో గట్టి దెబ్బ తగిలింది. ఐర్లాండ్ పేసర్ జై ముంద్రా టాప్ ఆర్డర్‌ను తీవ్రంగా దెబ్బతీశాడు. సంజు శాంసన్ (0), అభిషేక్ శర్మ (0), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (10) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఇషాన్ కిషన్ (12) రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత తిలక్ వర్మ (46 బంతుల్లో 55) అర్ధసెంచరీతో ఒంటరి పోరాటం చేసి జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఆఖర్లో శివమ్ దూబే (20), హర్షిత్ రాణా (28) వేగంగా ఆడి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చారు. విజయానికి ఆఖరి బంతి వరకు వీరోచితంగా పోరాడినప్పటికీ, తృటిలో విజయం చేజారింది. దీంతో భారత్ కేవలం ఒక్క పరుగు తేడాతో పరాజయం పాలైంది.

# దొంగ ఓట్లు లేని పవిత్రమైన ఓటర్ల జాబితానే మా లక్ష్యం: బీజేపీ నాయకులు బొక్కా బాల్ రెడ్డి

- హైదర్‌గూడ, ఉప్పరపల్లి, రాజేంద్ర నగర్ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో విస్తృత తనిఖీలు
- ఈసీఐ ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బొక్క బాల్ రెడ్డి

**రాజేంద్రనగర్ వెలుతురు జూన్ 28:**






భారత ఎన్నికల సంఘం (ECI) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా, ఆదివారం రోజున రాజేంద్ర నగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌గూడ డివిజన్, ఉప్పరపల్లి మరియు రాజేంద్రనగర్ లోని పలు పోలింగ్ బూత్‌లను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు బొక్క బాల్ రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లలో కూర్చుని ఓటర్లకు ఫారాలు పంపిణీ చేస్తున్న బూత్ స్థాయి అధికారులు (BLOs), మరియు పార్టీ తరపున పనిచేస్తున్న బూత్ స్థాయి ఏజెంట్ల (BLAs) పనితీరును ఆయన నిశితంగా పరిశీలించారు. అధికారులకు, ప్రజలకు ఉన్న పలు అనుమానాలను, అపోహలను ఈ సందర్భంగా ఆయన నివృత్తి చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ "దేశంలో 'వన్ నేషన్ వన్ ఓట్' (ఒకే దేశం – ఒకే ఓటు) లక్ష్యంతో ప్రతి ఒక్క అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే మా ధ్యేయం.

ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటర్ లిస్ట్ అత్యంత పవిత్రమైనది. ఈ పవిత్రమైన ఓటర్ల జాబితాలో ఏ ఒక్క దొంగ ఓటు కానీ, చనిపోయిన వారి ఓటు కానీ, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన వారి ఓటు కానీ ఉండటానికి వీల్లేదు.

ఓటర్ లిస్ట్‌ను క్షుణ్ణంగా, అంగుళం అంగుళం పరీక్షించి ఒక స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. అనర్హుల ఓట్లను ఏరిపారేసి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా మరియు వినియోగించుకునేలా బీజేపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి పనిచేయాలి."బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన యువతీ యువకులకు కొత్త ఓట్ల నమోదు ఫారాలను సక్రమంగా అందజేయాలని, ఎలాంటి తప్పులకు తావులేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, బీజేపీ ముఖ్య కార్యకర్తలు మరియు బూత్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోనే ఓటు నమోదు చేసుకోండి: కిషన్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**

హైదరాబాద్‌లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నగరంలో నివసిస్తున్న ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల ప్రజలు తమ ఓటు హక్కును హైదరాబాద్‌లోనే నమోదు చేసుకుని ఇక్కడే వినియోగించుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో నివసిస్తూ, ఇక్కడే ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ, ఆస్తులు కలిగి ఉన్నవారు తమ ఓటు కూడా నగరంలోనే ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు.హైదరాబాద్‌లో లక్షలాది మంది ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడ్డారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వారి పిల్లలు కూడా నగరంలోనే చదువుకుంటున్నందున నగర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో వారు కూడా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడే జీవనం సాగిస్తున్న వారు ఓటును కూడా హైదరాబాద్‌లోనే నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గ్రామాల్లో ఓట్లు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, భూములకు సంబంధించిన ప్రయోజనాలు కోల్పోతారని ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. అలాంటి ప్రచారాలను ఎవరూ నమ్మాల్సిన అవసరం లేదని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని అన్నారు.ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని ఎక్కడ నమోదు చేసుకోవాలనేది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఒక ప్రాంతంలో ఓటు నమోదు చేసుకున్నందుకు మరొక ప్రాంతంలో ప్రభుత్వ పథకాలు కోల్పోయే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు.అవసరమైతే భవిష్యత్తులో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటును తిరిగి స్వగ్రామానికి మార్చుకునే అవకాశం కూడా ఉంటుందని ఆయన గుర్తు చేశారు. కాబట్టి ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఓటును కొనసాగించి నగర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.హైదరాబాద్ అభివృద్ధి, నగర భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో నివసిస్తున్న వారందరూ ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, తద్వారా హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రూ.13,060 కోట్లతో హ్యామ్ రోడ్లకు శ్రీకారం.. పైలాన్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

**నల్లగొండ జిల్లా వెలుతురు జూన్ 28:**

రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టనున్న భారీ రహదారుల నిర్మాణ, విస్తరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నల్గొండ జిల్లా కనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న హ్యామ్ రోడ్ల ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు.

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.13,060 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. మొత్తం 34 ప్యాకేజీలుగా రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల పొడవున 441 రహదారులను విస్తరించడం, అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాలను మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు నల్గొండ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలతో కరచాలనం చేస్తూ వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు అభివాదాలు చేయగా, సీఎం వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా రహదారుల నిర్మాణం చేపట్టడం వల్ల ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యే అవకాశంతో పాటు నాణ్యమైన రహదారులు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలవనుంది.



# బీజేపీ పరాయి పార్టీ కాదు.. తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ: నితిన్ నబీన్

- సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచన
- ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపు
- 1984లో బీజేపీకి అండగా నిలిచిన ఘనత తెలంగాణదేనని వ్యాఖ్య
- పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచన
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా సేవ చేయాలని పిలుపు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 28:**

తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లో నూతనంగా నిర్మించిన బీజేపీ జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ పరాయి పార్టీ కాదని, తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతోనే బీజేపీ తెలంగాణలో బలపడిందని అన్నారు.కొత్తగా ప్రారంభమైన పార్టీ కార్యాలయాలు కేవలం భవనాలు మాత్రమే కాదని, ప్రజాసేవకు అంకితమైన సంకల్ప కేంద్రాలని నితిన్ నబీన్ చెప్పారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యాలయాలు ప్రజలతో పార్టీకి అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.'దేశమే మొదట.. పార్టీ తర్వాత.. స్వార్థం చివర' అనే సిద్ధాంతంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అదే బీజేపీ సిద్ధాంతమని పేర్కొన్నారు.నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని నితిన్ నబీన్ సూచించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే కృషిలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని కోరారు.1984 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీకి కేవలం రెండు ఎంపీ స్థానాలు మాత్రమే వచ్చిన సమయంలో అందులో ఒక స్థానాన్ని గెలిపించి పార్టీకి అండగా నిలిచిన ఘనత తెలంగాణ ప్రజలదేనని ఆయన గుర్తు చేశారు. ఆ చారిత్రక అనుబంధం వల్లే బీజేపీకి తెలంగాణతో ప్రత్యేక బంధం ఏర్పడిందని అన్నారు.తెలంగాణ ప్రజలు ఎప్పటికప్పుడు బీజేపీకి అండగా నిలుస్తున్నారని, అందువల్ల ఈ పార్టీ రాష్ట్రానికి ఎప్పుడూ పరాయి కాదని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయికి పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీని మరింత విస్తరించాలని సూచించారు.కొత్తగా ప్రారంభమైన జిల్లా కార్యాలయాలను ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని నితిన్ నబీన్ అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవాభావంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.బీజేపీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావడంలో ఈ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com